బుధవారం
25-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 213
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నకిలీ దగ్గు మందు కట్టడికి చర్యలు

గాంబియా, ఇండోనేసియా, ఉజ్బెకిస్తాన్ దేశాల్లో ఐదేళ్లలోపు 300 మందికిపైగా చిన్నారులు 2022లో దగ్గు మందుల కారణంగా ప్రాణాలు కోల్పోవడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్ఓ) తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది.

2లో

ఆస్కార్ బరిలో నాటు నాటు

ఒరిజినల్ సాంగ్ విభాగంలో నామినేషన్

న్యూఢిల్లీ: భారతీయ చిత్రం ఆర్ఆర్ఆర్‌లోని నాటు నాటు పాట ఆస్కార్ బరిలో నిలిచింది. 'లగాన్' తర్వాత మరో భారతీయ చిత్రం ఆస్కార్ అవార్డుకు ఇప్పటివరకు నామినేట్ కాలేదు. డాక్యుమెంటరీ ఫీచర్ విభాగంలో షానూక్‌సేన్ 'ఆల్ దట్ బ్రెత్స్', డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విస్పర్స్' నామినేట్ అయ్యాయి. నాటు నాటు పాటను గోల్డెన్ గ్లోబ్ అవార్డు వరించిన విషయం తెలిసిందే. 95వ ఆస్కార్ అవార్డుల నామినేషన్ల అధికార ప్రకటనలో ఉత్తమ ఒరిజనల్ పాట విభాగంలో నాటు నాటు నామినేటైంది. వివిధ భాషల నుంచి 300 చిత్రాలు ఎంపిక కాగా, అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన చిత్రాలను ఓటింగ్ ద్వారా ఆస్కార్ జ్యూరీ ఎంపిక చేసింది. నామినేషన్లను నటులు రిజ్ అహ్మద్, అల్లిసన్ విలియమ్స్ ప్రకటించారు. ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 12న లాస్ ఏంజిల్స్‌లో అట్టహాసంగా జరగనున్నాయి.

ఉత్తమ చిత్రం విభాగం: అవతార్: ది వే ఆఫ్ వాటర్, టాప్‌గన్: మావెరిక్, ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్, ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్, ఎల్విస్, ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్, ది ఫేబుల్‌మ్యాన్స్, టార్‌జి, ట్రయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్, ఉమెన్ టాకింగ్

ఉత్తమ దర్శకుడు..: మార్టిన్ మెక్‌డొనాగ్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్), డానియెల్ క్వాన్, డానియెల్ స్కీనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), స్టీవెన్ స్పీల్‌బర్గ్ (ది ఫేబుల్‌మ్యాన్స్), టడ్ ఫీల్డ్

- మిగతా 2 లో

జీవో 1పై తీర్పు రిజర్వు

హైకోర్టులో వాదనలు పూర్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రదర్శనలు, బహిరంగసభల నిర్వహణపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2వ తేదీన తీసుకొచ్చిన జీవో నంబరు 1పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం రిజర్వు చేసింది. సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టి ఈ జీవోను సస్పెండ్ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, దీనిపై తాము జోక్యం చేసుకోబోమని, హైకోర్టే విచారణ చేపడుతుందని స్పష్టం చేసింది. దీంతో హైకోర్టు విచారణ చేపట్టగా, రెండు రోజులపాటు సాగిన రెండు పక్షాల వాదనలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. జీవో నంబరు 1పై

- మిగతా 2 లో

లోకేశ్ పాదయాత్రకు అనుమతి

షరతులు పాటించాలి చిత్తూరు జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-చిత్తూరు: టీడీపీ నేత, ఎమ్మెల్సీ నారా లోకేశ్ ఈనెల 27న కుప్పం నుంచి తలపెట్టనున్న పాద యాత్రకు షరతులతో కూడిన పోలీసుల అనుమతి మంజూరు చేసినట్లు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీఏ మనోహర్... నారా లోకేశ్ ఈనెల 27న కుప్పం నుంచి తలపెట్టనున్న పాదయాత్రతో పాటు బహిరంగ సభ అనుమతి కోసం పలమనేరు డీఎస్పీ ఎస్.సుధాకర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారని, దీనిపై అన్ని పరిశీలించి పాదయాత్రకు కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అనుమతి ఇవ్వకముందే కొన్ని సామాజిక మాధ్యమాలలో అనుమతి ఇవ్వకుండా కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారని పోలీసులు, ప్రభుత్వంపై నిందలు మోపాలనే ఉద్దేశంతో వదంతులు సృష్టించడాన్ని

- మిగతా 2 లో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ

ఆపకుంటే ఇంటికే

ఉభయ ప్రభుత్వాలకు సీపీఐ, ఏఐటీయూసీ నేతల హెచ్చరిక

- రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజూ కొనసాగిన నిరసన దీక్షలు
- 30న విశాఖ మహాగర్జనకు తరలిరండి: జేవీఎస్ఎన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేనిపక్షంలో రెండు ప్రభుత్వాలను గద్దె దింపుతామని సీపీఐ, ఏఐటీయూసీ నేతలు హెచ్చరించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన దీక్ష 700 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30న విశాఖలో

- మిగతా 2 లో

నిజాలు ఎంతోకాలం దాగవు

- 'పప్పు'పై బీజేపీ వేలకోట్లు వెచ్చించింది
- దిగ్విజయ్ వ్యాఖ్యలు సరైనవి కావు
- సాయుధ దళాలు ఆధారాలివ్వక్కర్లేదు: రాహుల్

2లో

విద్యార్థుల సమరయాత్రకు మద్దతు

- జీవో-1పై ఐక్య పోరాటం
- 30న విశాఖ గర్జనకు సంఘీభావం
- సీపీఐ, సీపీఎం సమావేశం నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల చట్టం అమలు సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సమరయాత్ర (బస్సు యాత్ర)కు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. విజయవాడ దాసరిభవన్ (సీపీఐ రాష్ట్ర కార్యాలయం)లో ఉభయ కమ్యూనిస్టు పార్టీ నేతలు మంగళవారం సమావేశమయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అక్కినేని వనజ, జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, సీపీఎం తరపున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు

- మిగతా 2 లో

మళ్లీ వెయ్యి కోట్ల అప్పు

7.69 శాతం వడ్డీతో పదేళ్లలో చెల్లింపు

కేంద్రం అనుమతికి మరో రూ.1,557 కోట్లే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ రూ.1,000 కోట్ల అప్పు తెచ్చింది. ఆర్‌బీఐ నిర్వహించే సెక్యూరిటీ బాండ్ల వేలంలో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పాల్గొని సెక్యూరిటీలు అమ్మి రూ.1000 కోట్లు అప్పు తీసుకుంది. ఈ అప్పు రాబోయే పదేళ్లలో 7.69 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంది. కేంద్రం ఇచ్చిన రూ.4,557 కోట్లలో ఇప్పటికే రూ. 3వేల కోట్లు ప్రభుత్వం వాడేసింది. మరో రూ.1,557 కోట్లకు మాత్రమే అవకాశం ఉంది. మరోవారం రోజుల్లో మళ్లీ వేతనాలు, పెన్షన్ల కోసం ప్రభుత్వం అప్పుల వేట కొనసాగించాల్సి ఉంది. జీతాలు, పెన్షన్లకు ప్రతి నెలా సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయి. వీటిని సమకూర్చుకోవడానికి ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అప్పులు చేయడంతో సంక్షేమ పథకాల అమలుకు

- మిగతా 2 లో

నలుగురు ఏసీటీవోలపై వేటు

- గవర్నరుకు ఫిర్యాదు అనంతర పరిణామాలు
- ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలేనా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వాణిజ్య పన్నుల విభాగానికి చెందిన నలుగురు ఏసీటీవోలపై వేటు పడింది. దీంతో సహచర ఉద్యోగుల్లో కలకలం నెలకొంది. వారిపై వచ్చిన మీడియా కథనాలు, వ్యక్తిగత ఫిర్యాదులపై వేసిన విచారణ కమిటీ నివేదిక ప్రకారం ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా ఏసీటీవోలు మెహర్‌కుమార్, ప్రసాద్, సంధ్య, గద్దం ప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ గిరిజా శంకర్ వెల్లడించారు. ఆయా ఏసీటీవోలు వారి పరిధిలోని కంపెనీలకు చెందిన పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేయకపోవడం, కొందరి పట్ల ఉదాసీనంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. దాంతోపాటు కమర్షియల్ ట్యాక్స్ అసోసియేషన్ తరపున వారి సమస్యలపై గతంలో ధర్నాకు దిగారు. ఆయా అంశాలపై మీడియాలోను, వ్యక్తిగతంగాను వారిపై సీఎంఓ కార్యాలయానికి, ఉన్నతాధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. వాటిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ కమిటీ వేసింది. దీనిపై వివరణ కోరగా, సంతృప్తికరంగా సమాధానం ఇవ్వనందున చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణరావుతోపాటు ఆ ఉద్యోగ సంఘం నేతలు గవర్నరును కలిసి...ఏపీ ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. తమకు వేతనాలు అందడం లేదని, ఉద్యోగులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గవర్నరుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందంటూ ప్రతిపక్షాలు ఘాటుగా విమర్శించాయి. ఆ తర్వాత కొద్ది రోజులకే వాణిజ్య

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శిస్తాం

- కేరళలో రాజకీయ పార్టీల అనుబంధ సంఘాల ప్రకటన
- సీఎం జోక్యం కోరిన బీజేపీ

తిరువనంతపురం: వివాదాస్పద బీబీసీ డాక్యుమెంటరీ 'ఇండియా: ది మోడీ క్వశ్చన్'ను కేరళలో ప్రదర్శిస్తామని సీపీఎం, కాంగ్రెస్, ముస్లిం లీగ్ వంటి వివిధ రాజకీయ వర్గాలు మంగళవారం ప్రకటించాయి. దీంతో ముఖ్యమంత్రి పినరయి విజయన్ జోక్యం చేసుకుని ఇలాంటి ప్రయత్నాలకు స్వస్తి చెప్పాలని బీజేపీ కోరింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ద్వారా దేశంలో ఈ డాక్యుమెంటరీ ప్రసారాన్ని అడ్డుకుంది. 2002లో గుజరాత్ అల్లర్లలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని డాక్యుమెంటరీ ప్రశ్నించింది. ఆ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోదీ ఉన్నారు. అయితే ఈ డాక్యుమెంటరీని సోషల్ మీడియా, ఇంటర్నెట్ నుంచి తొలగించారు. రెండు భాగాల డాక్యుమెంటరీ రెండో భాగం మంగళవారం విడుదల కానుంది. సీపీఎం యువజన విభాగం డీవైఎఫ్ఐ ఈ డాక్యుమెంటరీని రాష్ట్రవ్యాప్తంగా క్యాంపస్‌లు, బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శిస్తామని ఫేస్‌బుక్ పేజీలో ప్రకటించడం ద్వారా రాష్ట్రంలో రాజకీయ తుఫానుకు తెరలేపింది. ఈ డాక్యుమెంటరీ ప్రదర్శన మంగళవారం మధ్యాహ్నం నుంచి కోజికోడ్ ముత్యాల కులంలో ప్రారంభమయింది. సాయంత్రం తిరువనంతపురంలోని పూజపుర మైదానంలో కూడా ప్రదర్శించబడుతుంది. రాష్ట్రంలోని 2 వేల కేంద్రాల్లో డాక్యుమెంటరీ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర

- మిగతా 2 లో

ఏపీలో ప్రజాస్వామ్యానికి విలువ లేదు

- సమస్య తీవ్రత ఉంటే ఏ స్థాయిలోనైనా గళం విప్పుతా
- తెలంగాణలో ఇప్పుడు ఎన్నికలు వచ్చినా పోటీకి సిద్ధం
- జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజాస్వామ్యానికి విలువ లేదని, అక్కడ ఉన్నోళ్లు మామూలు మనుషులు కాదని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం సాయంత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో జనసేన ప్రచార రథం వారాహికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒక రిసార్టులో పార్టీ తెలంగాణ ప్రాంత కార్యనిర్వాహకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలో నేను ఎదుర్కొంటున్న వాళ్లు సొంత బాబాయిని చంపేసుకున్న వాళ్లన్నారు. న్యాయ వ్యవస్థను తిడుతూ, పోలీసు వ్యవస్థను ఇష్టం వచ్చినట్టు వాడేవారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం అన్న పదానికి అక్కడ విలువ లేదన్నారు. పార్టీ శ్రేణులకు సరైన

- మిగతా 2 లో

దాహం... దాహం

- బలూచిస్తాన్, పంజాబ్, సింధ్‌లో తాగునీటి కటకట
- పనిచేయని ఫిల్టరేషన్ ప్లాంట్లు
- ఖాళీ బకెట్లతో స్థానికుల నిరసనలు

బలూచిస్తాన్: పాకిస్తాన్ ప్రజల గొంతు ఎండిపోతోంది. గుక్కెడు మంచినీళ్లు లభించక బలూచిస్తాన్‌లో, పంజాబ్, సింధ్ ప్రావిన్సుల ప్రజలు అల్లాడిపోతున్నారు. నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి నిరసనగా ర్యాలీలు చేపట్టారు. నిర్వహణ లోపం వల్ల ఫిల్టరేషన్ ప్లాంట్లు పనిచేయని కారణంగా తాగునీటి కటకట నెలకొన్నదని ఆరోపించారు. బలోచిస్తాన్‌లో కేవలం 25శాతం మందికి స్వచ్ఛమైన తాగునీరు అందుతోందని మిగతా ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని నిరసనకారులు తెలిపారు. ఖాళీ బకెట్లు, డబ్బాలతో నిరసన తెలిపారు. పనిచేయని ప్లాంటను అందుబాటులోకి తెస్తే తమ సమస్య తీరుతుందని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి పరిస్థితులు పాకిస్తాన్‌లో కొత్తకాదు. గతంలో సింధ్‌లో తాగునీటి కొరతకు వ్యతిరేకంగా జియే సింధ్ క్వామీ మహజ్ (జేఎస్‌క్యూఎం) ప్రదర్శనలు నిర్వహించింది. ఇండస్ ఎండిపోవ దానికి పంజాబ్ ప్రావిన్స్ కుట్రలే కారణమని, నీటి పంపకాల 1991 జల ఒప్పం దాన్ని పంజాబ్ ప్రభుత్వం పట్టించుకోలేదని నిరసనల్లో పాల్గొన్న నేతలు ఆరోపించారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)తో ముడిపడ్డవారికి, రాజకీయ సంబంధాలు ఉన్న ప్రముఖులకు సింధ్‌లో నీరు అందుతోందని, మిగిలినవారు గుక్కెడు నీటి కోసం నానా తంటాలు పడవలసి వస్తోందని నిరసనకారులు ఆరోపించారు. ఒక్క సింధ్‌లోనే కాదు పంజాబ్ ప్రావిన్స్‌లోనూ 75శాతం నీటి కొరత ఉంది. ఆ ప్రావిన్స్‌లో 1,27,800 క్యూసెక్కుల నీరు అవసరం కాగా 53,100 క్యూసెక్కులు మాత్రమే సరఫరా అవుతోంది.

నకిలీ దగ్గు మందు కట్టడికి చర్యలు

ప్రపంచ దేశాలకు డబ్ల్యూహెచ్ఓ పిలుపు

ఐరాస: గాంబియా, ఇండోనేసియా, ఉజ్బెకిస్తాన్ దేశాల్లో ఐదేళ్లలోపు 300 మందికిపైగా చిన్నారులు 2022లో దగ్గు మందుల కారణంగా ప్రాణాలు కోల్పోవడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ఓ) తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తంచేసింది. కల్తీ ఔషధాల నుంచి పిల్లలను కాపాడాలని నొక్కి చెప్పింది. తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చింది. కల్తీ మందులు తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనిచేయక పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయినట్లు డబ్ల్యూహెచ్ఓ తాజా ప్రకటన పేర్కొంది. మందు దుకాణాల్లో లభించే దగ్గు మందుల్లో డిథనైల్ గ్లోకోల్, ఇథైలీన్ గ్లైకాల్ వంటి విషపదార్థాలు అధిక మోతాదుల్లో ఉంటున్నట్లు గుర్తించింది. పరిశ్రమల్లో వినియోగించే రసాయనాలు ప్రాణాంతకమని, వాటి మోతాదు మందుల్లో చాలా తక్కువగా ఉండాలని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. ఏడు దేశాల్లో కల్తీ సిరప్‌ల గురించి నాలుగు నెలల్లో అనేక ఫిర్యాదులు వచ్చిన క్రమంలో 194 సభ్యదేశాల్లో మరిన్ని మరణాలు సంభవించకుండా తక్షణమే జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని అన్ని దేశాలకు ఆరోగ్య సంస్థ స్పష్టంచేసింది. చిన్నారుల మరణాలను నిరోధించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొంది. నాసిరకం మందులు నియంత్రించేందుకు తనిఖీలు ప్రారంభించాలని సంబంధిత దేశాలకు పిలుపునిచ్చింది. ఇండోనేసియాకు చెందిన పీటీ యరిందో ఫార్మాటమా, పీటీ యూనివర్సల్ ఫార్మాస్యూటికల్, పీటీ కోనిమెక్స్, పీటీ ఏఎఫ్ఐ ఫార్మా కంపెనీలకూ గతేడాదిలోనే దగ్గు మందుల తయారీకి సంబంధించి హెచ్చరికలను డబ్ల్యూహెచ్ఓ జారీచేసింది. కల్తీ మందులు తయారు చేయమని ఆయా కంపెనీలు వాదించిన క్రమంలో విచారణ ప్రక్రియ ప్రస్తుతానికి కొనసాగుతున్న విషయం విదితమే.

43 మంది పీటీఐ నేతల రాజీనామాకు స్పీకర్ ఆమోదం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్‌కు చెందిన దిగువ సభ సభ్యులు 43మంది తమ రాజీనామాలను సమర్పించగా నేషనల్ అసెంబ్లీ స్పీకర్ రాజా పర్వేజ్ అష్రాఫ్ మంగళవారం వాటిని ఆమోదించారు. ఈ రాజీనామాలను ఆమోదిస్తూ వివరాలను పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ (ఈసీపీ)కి స్పీకర్ పంపినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. తమ రాజీనామాలను ఉపసంహరించుకోవాలని భావించి స్పీకర్‌ను కలిసేందుకు 45మంది పీటీఐ ఎంఎన్ఏలు ప్రయత్నించిన మరుసటి రోజు ఈ పరిణామం చోటుచేసుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై పీటీఐ నేత ఫవాద్ చౌదరి స్పందిస్తూ ప్రతిపక్ష నేతగా రాజా రియాజ్ కోసమే ఇదంతా అన్నారు. ఫిరాయింపుదారులనే షరీఫ్ ప్రభుత్వం నమ్ముకుంటోందని, ఇప్పటికే 172 మంది సభ్యుల మద్దతును కోల్పోయిందని ఫవాద్ ట్వీట్ చేశారు. స్పీకర్ తీసుకున్న చర్యల ఫలితంగా 40శాతం సీట్లు ఖాళీ అయ్యాయని వ్యాఖ్యానించారు. ఈ సమస్య పరిష్కారానికి సార్వత్రిక ఎన్నికలొక్కటే పరిష్కారమని ఫవాద్ నొక్కిచెప్పారు. ఇదిలావుండగా స్పీకర్ తమ రాజీనామాలను ఆమోదించినాగానీ తమను డీనోటిఫై చేయొద్దని ఎన్నికల కమిషన్‌కు పీటీఐ సభ్యులు సోమవారం విన్నవించారు. తమ రాజీనామాలను ఎంఎన్ఏలు వెనక్కితీసుకోన్నుట్లు ఎన్నికల సంఘానికి పీటీఐ తెలిపింది. స్పీకర్‌కూ సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది.

అమెరికాలో వరుస కాల్పులు

- కాలిఫోర్నియాలో ఏడుగురి మృతి
- 8 రోజుల్లో మూడో ఘటన

కాలిఫోర్నియా: అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. నూతన సంవత్సరం ప్రారంభం నుంచి మారణ హోమాలు జరుగుతూనే ఉన్నాయి. కేవలం ఎనిమిది రోజుల్లో మూడో కాల్పుల ఘటన నమోదైంది. కాలిఫోర్నియాలోని హాఫ్‌మూన్ బే నగరంలో మంగళవారం రెండు చోట్ల కాల్పులు జరిగి ఏడుగురు మరణించారు. మరికొందరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించనట్లు కాలిఫోర్నియా, శాన్‌మెటియో కౌంటీ షరీఫ్ కార్యాలయం వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.22 గంటలకు శాన్ మెటియో హైవే 92 వద్ద కాల్పులు జరిగి నలుగురు మరణించగా మరో ముగ్గురు కూడా కాబ్రిల్లో హైవే వద్ద కాల్పుల్లో మృతి చెందినట్లు షరీఫ్ క్రిస్టినా కార్పొస్ తెలిపారు. హాఫ్‌మూన్ బే వాసి చెంగ్లీ జావో (67)ను పోలీసులు అరెస్టు చేసినట్లు చెప్పారు. కాల్పులకు గురైన వారంతా చైనాకు చెందిన వ్యవసాయ కార్మికులని షరీఫ్ వెల్లడించారు. కాల్పుల ఉద్దేశం తెలియలేదని చెప్పారు. సోమ వారం లాస్‌ఏంజెల్స్ సమీపంలోని మాంటేరీ పార్క్‌లో చైనీయుల లూనార్ నూతన సంవత్సర వేడుకల్లో జరుగుతుండగా ఓ దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపి పది మందిని హతమార్చాడు.

ఆస్కార్ బరిలో 'నాటు నాటు'

(మొదటిపేజీ తరువాయి)

(టార్), రూబెన్ ఆస్టాండ్ (ట్రైయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్)

ఒరిజినల్ సాంగ్...: నాటు నాటు (ఆర్ఆర్ఆర్), అప్లాజ్ (టెల్ ఇట్ లైక్ ఎ ఉమెన్), హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్: మార్వెరిక్), లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్), ది ఈజ్ ఏ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)

ఉత్తమ సహాయ నటుడు: బ్రెన్డాన్ గ్లెసన్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్), బ్రెయిన్ టైరీ హెన్రీ (కాజ్‌వే), జడ్ హిర్ష్ (ది ఫేబుల్‌మ్యాన్స్), బేరీ కియోఘాన్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్), కి హుయ్ క్వాన్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)

ఉత్తమ సహాయ నటి: ఆంజెలా బాస్సెట్ (బ్లాక్ పాంథర్: వకండ ఫరెవర్), హాంగ్ చ్యూ (ది వేల్), కెర్రీ కాండన్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్), జామీ లీ కర్టిస్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), స్టెఫానీ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)

ఉత్తమ కాస్ట్యూమ్: బేబీలాన్ (మ్యారీ జోఫెర్స్), బ్లాక్‌పాంథర్: వకండా ఫరెవర్ (రూథ్‌కార్టర్), ఎల్విస్(కేథరిన్ మార్టిన్), ఎవ్రీథింగ్, ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్ (షెర్లీ కురాట), మిసెస్ హారిస్ గోస్ టు పారిస్ (జెన్నీ బియావాన్)

ఉత్తమ సౌండ్: ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్, అవతార్: ది వే ఆఫ్ వాటర్, ది బ్యాట్‌మెన్, ఎల్విస్, టాప్ గన్: మావరిక్

స్క్రీన్‌ప్లే..: మార్టిన్ మెక్‌డొనాగ్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్), డానియెల్ క్వాన్, డానియెల్ స్కీనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), స్టీవెన్ స్పీల్‌బర్గ్, టోనీ కుష్నర్ (ది ఫేబుల్‌మ్యాన్స్), టడ్ ఫీల్డ్ (థార్), రూబెన్ ఆస్టాండ్ (ట్రైయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్).

విద్యార్థుల సమరయాత్రకు మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు హాజరయ్యారు. ఈ సమావేశం రోడ్‌షోలు, ర్యాలీలు, సభలకు అనుమతి నిరాకరిస్తూ అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన జీవో నంబరు-1పై పోరాటం చేయాలని నిర్ణయించింది. జీవో నంబరు-1ను ఉపసంహరించుకోవాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 30న విశాఖపట్నంలో జరిగే కార్మిక మహాగర్జనకు సీపీఐ, సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ... విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలెదుర్కొంటున్న వివిధ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కారించాలని, ఇందుకోసం ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పోరాడాలని నిర్ణయించాయి.

లోకేశ్ పాదయాత్రకు అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఎస్పీ ఖండించారు. పాదయాత్రలో ప్రజలు, వాహనదారుల అత్యవసర రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలిగించకూడదని, బహిరంగ సభల సమయాలకు కట్టుబడి ఉండాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించకూడదని, రోడ్లపై ఎలాంటి సమావేశాలు నిర్వహించకూడదని, ఆరోగ్య అత్యవసర పరిస్థితులను నిర్వహించడానికి నిర్వాహకులు సమావేశ స్థలంలో ప్రథమ చికిత్స నిమిత్తం వైద్య పరికరాలతో అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని, ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సమావేశ స్థలం దగ్గర అగ్నిమాపక యంత్రాన్ని ఉంచవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఎలాంటి బాణసంచా పేల్చడం పూర్తిగా నిషేధించామని, పార్టీ కార్యకర్తలు, సమావేశంలో పాల్గొనే వారు సమావేశంలోకి ఎటువంటి మారణాయుధాలు తీసుకెళ్లకుండా నిర్వాహకులు నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసులు ఎప్పటికప్పుడు ఇచ్చే ఆదేశాలను పాటిస్తూ, శాంతి భద్రతల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణలో సహకరించాలని సూచించారు. ఈ నిబంధనలకు లోబడి పాదయాత్రను చేసుకోవాలని ఆయన తెలిపారు.

నిజాలు ఎంతోకాలం దాగవు

న్యూఢిల్లీ: తనను 'పప్పు'గా నిరూపించేందుకు బీజేపీ కొన్ని వేలకోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు బీజేపీ-ఆర్ఎస్ఎస్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, నిజాలు ఎక్కువకాలం దాగబోవని ఆయనన్నారు. దేశంలో నిజమే చెల్లుతుందని డబ్బు, అధికారం, అహంకారం కాదన్నారు. బీజేపీకి కాంగ్రెస్ నేర్పుతుందని భారత్ జోడో యాత్ర క్రమంలో మంగళవారం జమ్ములో విలేకరులతో మాట్లాడిన రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. నిజం ఎప్పటికైనా బయటకు వస్తుందని, డబ్బు-అధికారం ఉంటే ఎమైనా సాధించవచ్చని బీజేపీ-ఆర్ఎస్ఎస్ నమ్ముతోందిగానీ అది నిజం కాదని ఆయన అన్నారు. 'మీరు ఎవరినైనా అప్రతిష్టపాల్జేయవచ్చు.. ఏ ప్రభుత్వాన్నైనా కొనేయొచ్చు. డబ్బుతో ఏదైనా సాధ్యంటే నిజం కాదు. నిజం ఎదుట ధనం, అధికారం నిలవలేవు. ఈ వాస్తవాలను బీజేపీ నేతలు మెల్లమెల్లగా గ్రహిస్తున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో మెరుపు దాడులపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను రాహుల్ ఖండించారు. అవి ఆయన వ్యక్తిగత అభిప్రాయాలన్నారు. సింగ్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ విభేదిస్తుందని చెప్పారు. సాయుధ దళాల సామర్థ్యం గురించి తమకు తెలుసని, సైనికులు అసాధారణ విధులు నిర్వర్తించగలరని, ఎలాంటి రుజువులు చూపించాల్సిన అవసరం వారికి లేదని రాహుల్ నొక్కిచెప్పారు. 'కొందరు నోటికొచ్చినదల్లా మాట్లాడతారు... మా సీనియర్ నాయకుడు ఆలోచించకుండా మాట్లాడినందుకు చింతిస్తున్నా' అని అన్నారు. దిగ్విజయ్ సింగ్‌పై అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని ఓ విలేకరి ప్రశ్నించగా కాంగ్రెస్ ప్రజాస్వామ్య పార్టీ అని నియంతకాదని రాహుల్ బదులిచ్చారు. 'దిగ్విజయ్ సింగ్ వ్యక్తిగత అభిప్రాయాలను మేము అభినందించడం లేదు. వాటితో పార్టీకి సంబంధం లేదు. సాయుధ దళాల సామర్థ్యంపై కాంగ్రెస్‌కు పూర్తి నమ్మకం ఉంది. వారు దేనినీ రుజువు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎలాంటి రుజువులు ఇవ్వనక్కర్లేదు' అని రాహుల్ అన్నారు. అభిప్రాయాల వక్తీకరణ స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉన్నదిగానీ బీజేపీలో లేదని చెప్పారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లో ఏదైనా నిర్ణయం జరిగితే ఇంకెవ్వరూ దాని గురించి మాట్లాడే అవకాశం ఉండబోదని రాహుల్ విమర్శించారు.

జీవో 1పై తీర్పు రిజర్వు

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణతోపాటు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ నుంచి కూడా పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ ముగ్గురు పిటిషనర్ల తరపున కూడా న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే ప్రభుత్వం ఈ జీవో తెచ్చిందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం తరపున ఏజీ ఈ జీవోను సమర్థిస్తూ వాదనలు వినిపించారు. కందుకూరు, గుంటూరు తొక్కిసలాట ఘటనల్లో అనేక మంది మృతి చెందిన దరిమిలా భద్రతా కారణాలతోనే ఈ జీవోను ప్రభుత్వం తీసుకొచ్చిందని, ప్రతిపక్షాల సభలు, ర్యాలీలను అడ్డుకునే ఉద్దేశం కాదని జీవో ప్రాధాన్యతను వివరించారు. రెండు వైపులా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

మళ్లీ వెయ్యి కోట్ల అప్పు

(మొదటిపేజీ తరువాయి)

కష్టాలు మొదలయ్యాయి. అన్నిశాఖలకు సంబంధించిన నిధులను నవరత్నాల అమలుకు మళ్లిస్తున్నారు. గత రెండు, మూడు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగులకు 15వ తేదీ వరకు జీతాలు చెల్లిస్తూనే ఉండడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేతలు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి తమకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు వచ్చేలా చూడాలని, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరడం సంచలనమైంది. దీంతో ఎలాగైనా ఈసారి వచ్చే నెల 1వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని నిరూపించుకోవాలన్న యోచనతో జీతాలు, పెన్షన్లకు అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు అప్పుల కోసం అన్వేషణ కొనసాగిస్తోంది.

నలుగురు ఏసీటీవోలపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

పన్నులశాఖ ఉద్యోగులపై వేటువేయడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఉద్యోగులపై వేటు వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ...గతంలో చలో విజయవాడ నిర్వహించారు. అది పెద్దఎత్తున విజయవంతం కావడంతో ప్రభుత్వం తీవ్ర విమర్శల పాలైంది. అప్పటి నుంచి ఉద్యోగుల పట్ల జగన్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని, వారికి ప్రతినెలా వేతనాల్లో జాప్యం, ప్రయోజనాలు అమలు చేయకపోవడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి.

డాక్యుమెంటరీ ప్రదర్శిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు వి.వసీఫ్ ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. ఆ తర్వాత, సీపీఎం వామపక్ష విద్యార్థి సంఘం, అలాగే యూత్ కాంగ్రెస్‌తో సహా కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) వివిధ విభాగాలు ఇలాంటి ప్రకటనలు చేశాయి. డాక్యుమెంటరీని దేశవ్యాప్తంగా ప్రదర్శించాలని వారు పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కన్నూర్‌లోని మంగట్టుపరంబ క్యాంపస్‌లో డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఇది ఎర్నాకులంలోని మహారాజాస్ కళాశాల, న్యాయ కళాశాల, క్యూసెట్ వద్ద కూడా ప్రదర్శించారు. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) మైనారిటీ విభాగం కూడా ఈ డాక్యుమెంటరీని గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రంలోని అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపింది. అయితే బీజేపీ అటువంటి చర్యను 'దేశద్రోహం'గా అభివర్ణించింది. కేరళ సీఎం తక్షణమే జోక్యం చేసుకుని అటువంటి ప్రయత్నాలను మొగ్గలోనే తుంచాలని కోరింది. రాష్ట్రంలో డాక్యుమెంటరీ ప్రదర్శనకు అనుమతి ఇవ్వరాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్ విజయన్‌కు ఫిర్యాదు చేశారు. డాక్యుమెంటరీ ప్రదర్శన దేశ ఐక్యత, సమగ్రతకు విఘాతం కలిగించే విదేశీ చర్యలను సమర్థించినట్లే అవుతుందని సురేంద్రన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ కూడా డాక్యుమెంటరీ ప్రదర్శనకు అనుమతించవద్దని ముఖ్యమంత్రిని కోరారు. ఈ విషయంలో ఆయన తక్షణ జోక్యం చేసుకోవాలని కోరారు. కాగా డాక్యుమెంటరీకి లింక్‌లను పంచుకునే బహుళ యూట్యూబ్ వీడియోలు, ట్విట్టర్ పోస్ట్‌లను బ్లాక్ చేయాలని కేంద్రం గత వారం ఆదేశించింది.

ఏపీలో ప్రజాస్వామ్యానికి విలువ లేదు

(మొదటిపేజీ తరువాయి)

దారి ఏర్పరచకుండా మాట్లాడితే అన్ని పార్టీలు మిమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటారని తెలిపారు. సమస్య తీవ్రత ఉందంటే మాత్రం ఏ స్థాయిలో కావాలన్నా గళం విప్పుతా, భయపడకుండా మాట్లాడతానని స్పష్టం చేశారు. తెలంగాణలో భావోద్వేగంతో కూడిన రాజకీయాలు ఉంటే, ఆంధ్ర ప్రదేశ్‌లో కులాల గీతల మధ్య రాజకీయం చేయాలన్నారు. అందుకే ఆంధ్రాలో మాట్లాడేటప్పుడు కులాల గీతల మధ్యే మాట్లాడాల్సి వస్తుందన్నారు. అక్కడ అభివృద్ధి కావాలంటే ఆంధ్ర ప్రదేశ్‌లో పరిశ్రమలు రావాలని, అక్కడ పరిశ్రమలు రాకుంటే మళ్లీ తెలంగాణకు వలసలు పోవాలని ఓ ఉత్తరాంధ్ర యువకుడు చెప్పిన మాటలు ఆలోచింపచేశాయన్నారు.

ఎవరైనా పొత్తుకు వస్తే సంతోషం... బీజేపీ అయినా సరే...

తెలంగాణ అసెంబ్లీలో జనసేన పార్టీ సభ్యులు ఉండాలని, అందుకోసం పోరాటం చేద్దామని, అవకాశాన్ని బట్టి 25 నుంచి 40 అసెంబ్లీ స్థానాలు, ఏడు నుంచి 14 లోక్‌సభ స్థానాల్లో బరిలోకి దిగనున్నట్టు పవన్ కల్యాణ్ ప్రకటించారు. మనం పోటీ చేయని స్థానాల్లో కూడా జనసేన ప్రభావం చూపాలన్నారు. ఎన్నికల ప్రకటన ఎప్పుడు వచ్చినా పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. కావాలంటే ఒకటికి రెండు సార్లు మీ నియోజకవర్గాల్లో తిరుగుతానని అన్నారు. తెలంగాణ ప్రజలు మీరు ఎందుకు వచ్చారని అడిగితే భుజం కాయడానికి వచ్చామని చెప్పాలని తెలిపారు. ఆ క్రమంలో ఎవరైనా పొత్తుకు వస్తే సంతోషమని, అది బీజేపీ అయినా సరే అన్నారు. అయితే అది జనసేన భావజాలానికి, తెలంగాణ రాష్ట్ర క్షేమానికి సరైందనుకుంటేనే ఆలోచిద్దామన్నారు. ఎవరితో పొత్తు పెట్టుకున్నా జీహెచ్ఎంసీ ఎన్నికల్లా వదిలేయమని చెప్పారు. పోరాట పటిమ ఉన్నవారు తెలంగాణ ప్రజలని, అలాంటి పోరుగడ్డ మీద కొత్త కొత్త పార్టీలు, ప్రభుత్వాలు వచ్చాయన్నారు.

ఆపకుంటే ఇంటికే

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించ తలపెట్టిన మహాగర్జన దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ పిలుపు మేరకు మంగళవారం రెండో రోజు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టారు. దీనిలో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలో సీపీఐ, సీపీఎం, తెలుగుదేశం పార్టీ సమష్టిగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గడచిన రెండేళ్లకు పైగా విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు ప్రైవేటీకరణను నిరసిస్తూ కుటుంబాల సమేతంగా ఉద్యమం చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎవరూ పట్టించుకోకపోవడమే కాకుండా, నియంతృత్వ ధోరణితో నిర్ణయాలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఇటువంటి నియంతృత్వ ప్రభుత్వాలను సాగనంపే తరుణం ఆసన్నమైందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటుపరం చేస్తే ఉద్యమం మరింత ఉధృతం చేసేందుకు అఖిలపక్ష పార్టీలన్నీ సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బోనంగి చిన్నయ్య పడాల్, అల్లూరు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సీపీఐ నేతలు అంజలి, సర్పంచ్ పేట్ల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు దారాదత్తం చేస్తున్న మోదీ: వనజ

మోదీ ప్రభుత్వం దేశంలో అన్ని ప్రభుత్వరంగ ఆస్తులను, పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దారా దత్తం చేయడానికి ప్రయత్నిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి వనజ ముఖ్య అతిథిగా విచ్చేయగా సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునీర్ తదితరులు పాల్గొన్నారు. నరసాపురం పట్టణంలో సీపీఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, మండల కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్, పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఎటువంటి త్యాగాలకైనా సిద్ధం: దేగా ప్రభాకర్

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడానికి ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్ హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న నిరసనలో ప్రజాసంఘాలు కలసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ కె.రామకృష్ణ, కొత్తపేట మండల కార్యదర్శి మోకా హేమలత, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.రవికుమార్, ప్రజానాట్యమండలి జిల్లా సెక్రెటరీ వి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. నిడదవోలులో జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు రేఖ భాస్కరరావు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

త్యాగాల పునాదులపై..: పి.రామచంద్రయ్య

తెలుగు ప్రజల త్యాగాల పునాదులపై నిర్మితమైన విశాఖ ఉక్కు రక్షణ మనందరి బాధ్యతని, ఈనెల 30న విశాఖలో జరిగే గర్జన సభకు భారీగా ప్రజలు తరలిరావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పత్తికొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించాలి: రావులపల్లి

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ఉపసంహరించాలని, లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ హెచ్చరించారు. సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర సమితుల పిలుపులో భాగంగా మచిలీపట్నం ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్, ఏఐటీయూసీ నగర్ కార్యదర్శి లింగం ఫిలిప్ అధ్యక్షత వహించగా, వెలగపూడి ఆజాద్, జిల్లా ఇంచార్జ్ కార్యదర్శి తాడిపర్తి తాతయ్య, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు ఒంటి పులి లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు దగ్గాని సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లాలో రెండోరోజూ నిరసన దీక్షలు కొనసాగాయి. నందిగామ గాంధీ సెంటర్‌లో ప్రముఖ న్యాయవాది మన్నెం నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్ పాల్గొని విశాఖ ఉక్కు పరిశ్రమకు తెలుగు ప్రజలు చేసిన త్యాగాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నందిగామ, మైలవరం నియోజకవర్గ కార్యదర్శులు చుండూరి సుబ్బారావు, బుడ్డి రమేష్, జగ్గయ్యపేట, నందిగామ నేతలు జె.శ్రీనివాసరావు, శివాజీ, చామంతి, వేముల వీరయ్య, మన్నే హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీం పట్నంలో కార్మిక ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, బుడ్డి రమేష్, టి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో

స్థానిక డోన్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ముందు రెండో రోజు సీపీఐ డోన్ మండల కార్యదర్శి ఎస్ పులి శేఖర్ అధ్యక్షతన నిరసన దీక్ష కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, హమాలి వర్కర్స్ యూనియన్ డోన్ నియోజకవర్గం కార్యదర్శి కృష్ణ,ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ గఫూర్ తదితరులు పాల్గొన్నారు. దీక్షకు వలసల గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు వలసల వెంకట రాముడు, వలసల సుధాకర్ మద్దతు తెలిపారు.

శ్రీకాళహస్తిలో

శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, గురవయ్య, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు: జంగాల

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచన ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ తెనాలి బస్టాండ్ నుంచి ప్రదర్శనగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశాఖ ఉక్కు సంఘీభావ దీక్షను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ ప్రారంభించి తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మకు మెమోరాండం సమర్పించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, ఉక్కు కర్మాగారాన్ని పర్యరక్షించుకోవడానికి ప్రజలు పార్టీలకతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి ఉద్యమ బాటను వివరించారు. ఈ కార్యక్రమంలో తెనాలి నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, మంగళగిరి కార్యదర్శి చినతిరుపతయ్య, ఉప్పాల సత్యనారాయణ, కంచర్ల కాశియ్య, మద్దినేని కిరణ్‌బాబు, పాశం వెంకటేష్, బుజ్జా శ్రీనివాసరావు, జె.వి.రాంబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

‘ఎగ్జామ్ వారియర్స్’ విద్యార్థులకు ఒక ఆస్తి

- తెలుగు ప్రతిని ఆవిష్కరించిన గవర్నర్ విశ్వభూషణ్
- వెయ్యి మందికి పైగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రధాని విరచిత ‘ఎగ్జామ్ వారియర్స్’ పుస్తకం విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విద్యార్థుల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా రచించిన ఎగ్జామ్ వారియర్స్ తెలుగు అనువాదాన్ని మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాసనాలతో సమ్మిళితమైన ఈ పుస్తకం సరదాగా సంభాషించినట్లుగా ఉండటం ప్రత్యేకత అన్నారు. పరీక్షల సమయంలోనే కాక, జీవితంలో ఎదుర్కొనే అనేక విషయాలకు ఇది అత్యుత్తమ నేస్తం వంటిదన్నారు. బోధనలా కాకుండా వాస్తవికంగా ఆలోచనలు రేకెత్తించేలా విద్యార్థులకు ఈ పుస్తకం మార్గదర్శిగా నిలుస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అనేక చిట్కాలను అందిస్తూ ఆచరణాత్మకంగా, ఆలోచనాత్మకంగా ప్రధాని మార్గనిర్దేశం చేశారన్నారు. పరీక్షల పట్ల అతిగా ఆందోళన చెందటం, దానిని జీవన్మరణ సమస్యగా భావించటం అవసరం లేదని మనల్ని మనం విశ్వసిస్తే... అన్ని మన దారిలోకి వస్తాయని గవర్నర్ తెలిపారు. ‘ఎగ్జామ్ వారియర్స్’ పుస్తకం తెలుగుతో సహా 11 భారతీయ భాషలలో ప్రచురితమైందని అన్నారు. బోర్డు పరీక్షలలో విద్యార్థుల పనితీరును మెరుగుపరచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి అవసరమైన చిట్కాలను పంచుకోవడం ఈ పుస్తకం ముఖ్య ఉద్దేశమన్నారు. ‘పరీక్షలపై చర్చ–2023’ 6వ ఎడిషన్‌లో భాగంగా జనవరి 27న న్యూఢిల్లీలోని తాల్కతోరా ఇండోర్ స్టేడియంలో 38 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నరేంద్ర మోదీ సంభాషించనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ వైద్య కళాశాల, కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, కొందరు విద్యార్థులకు గవర్నర్ స్వయంగా పుస్తక ప్రతులను అందజేశారు.

అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న 1000 మందికి పైగా విద్యార్థులకు రాజ్ భవన్ తరపున పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఎ.సాంబశివ రెడ్డి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, పాఠశాల మౌలిక వసతుల కమిషనర్ కాటమనేని భాస్కర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి, పాఠశాల మధ్యాహ్న భోజన పథకం సంచాలకురాలు నిధి మీనా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు పాల్గొన్నారు.

రేపటి ట్రాక్టర్ల ర్యాలీ జయప్రదం చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లు–2022ను ఉపసంహరణ, రైతు రుణమాఫీ తదితర డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయం మేరకు ఈనెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే ట్రాక్టర్ల ర్యాలీలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయం మేరకు ఈ ర్యాలీలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మకమైన రైతాంగం ఉద్యమ సందర్భంగా లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు పరచకుండా తుంగలో తొక్కిందని, రైతు సంఘాలు, వినియోగదారుల సంఘాలను సంప్రదించకుండానే కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లు–2022ను ఇటీవల పార్లమెంటులో ప్రవేశ పెట్టడం చాలా దుర్మార్గమని ఖండించారు. అన్ని పంటలకు కనీస న్యాయమైన మద్దతు ధరల చట్టం తీసుకొస్తామని చెప్పి ఆచరణలో విస్మరించిందన్నారు. అపరిష్కృతంగా ఉన్న రైతుల డిమాండ్ల సాధన కోసం రైతాంగం కదిలి వచ్చి ట్రాక్టర్లతో రిపబ్లిక్ డే నాడు (జనవరి 26న) ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేయాలని వారు రైతాంగానికి పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డు–మీసాల రాజేశ్వరరావు బ్రిడ్జి నుంచి ట్రాక్టర్లు, బైక్‌ల ర్యాలీ ప్రారంభమవుతుందని, సకాలంలో రైతులు తమ వాహనాల్లో చేరుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టరేట్ల ముట్టడికి కలిసి రండి

డేగా ప్రభాకర్ పిలుపు

విశాలాంధ్ర–అమలాపురం: రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా రిపబ్లిక్ డే నాడు కలెక్టరేట్ల ఎదుట చేసే ఉద్యమంలో పాల్గొనాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో రైతు నాయకుడు యాళ్ల బ్రహ్మానందం అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రౌండ్ టేబుల్ సమావేశంలో డేగా ప్రభాకర్ మాట్లాడారు. రైతు సంఘాలు సంఘటితంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 26న కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వాలని, దానికి ప్రభుత్వం అడ్డుపడితే డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి అందజేయాలని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు మూషిణి రామకృష్ణారావు మాట్లాడుతూ రైతుల పట్ల కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీపీఎం నాయకుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తెచ్చి రైతుల్ని ఇబ్బంది పెట్టారన్నారు. టీడీపీ నాయకులు మట్టా మహాలక్ష్మి, ప్రభాకర్, జనసేన నాయకుడు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు, కారెం వెంకటేశ్వరావు, బొంతు రమణ, చెల్లుబోయిన కేశవశెట్టి, పచ్చిమాల వసంతకుమార్, వేగిరాజు వెంకట రాజు తదితరులు పాల్గొన్నారు.

‘గురజాడ’ ఆడిటోరియం నిర్మించాలి

సీఎంకు ఈశ్వరయ్య లేఖ



విశాలాంధ్ర–విజయనగరం: మహాకవి గురజాడ అప్పారావు అభ్యుదయ సాహిత్య సేవలను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య కోరారు. గురజాడకు స్మారకచిహ్నంగా ఆయన స్వగృహం పక్కనున్న స్థలంలో ఆడిటోరియాన్ని నిర్మించి, అందుకు గురుజాడ పేరుపెట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాసినట్లు ఈశ్వరయ్య తెలిపారు. ఆయన మంగళవారం సీపీఐ విజయనగరం జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ, సహాయ కార్యదర్శి బుగత అశోక్, విశాలాంధ్ర బుక్‌హౌస్ జిల్లా మేనేజర్ సయ్యద్ ఇబ్రహీంతో కలిసి గుజరాడ స్వగ్రహాన్ని సందర్శించారు. గురజాడ అప్పారావు మనువడి భార్య ఇందిరకు కన్యాశుల్కం పుస్తకాన్ని జ్ఞాపికగా అందచేశారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ సామాజిక చైతన్యం తెచ్చే రచనలు చేసిన గురజాడ ప్రాచీన సాహిత్యానికి ఆధునికత అద్దిన తెలుగుకవి అని కొనియాడారు. ముత్యాల సరాలు రచన ఎందరో యువకవులకు, సాహితీవేత్తలకు అనుసరణీయ మైందన్నారు. ఇంతటి మహాకవికి కేవలం జయంతి, వర్థంతి నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తే సరిపోదని, ఒక ఆడిటోరియం నిర్మిస్తే ఘనమైన నివాళి ఇచ్చినట్లు అవుతుందన్నారు. గురజాడ ఆడిటోరియం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని, అంతవరకు దానిక ఓసం సీపీఐ పోరాడుతుందని ఈశ్వరయ్య తెలిపారు.

ఆప్కో చైర్మన్‌గా గంజి చిరంజీవి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆప్కో చైర్మన్‌గా గంజి చిరంజీవిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం జీవో నంబరు–8 ద్వారా ఉత్తర్వులు జారీజేసింది. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గానికి చెందిన గంజి చిరంజీవి...గతేడాది ఆగస్టులో టీడీపీని వీడి వైసీపీలో చేరారు. వైసీపీలో చేరిన వెంటనే ఆ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతల్ని పార్టీ అధినేత, సీఎం జగన్ అప్పగించారు. తాజాగా క్యాబినెట్ హోదా కలిగిన ఆప్కో చైర్మన్‌గా నియమించారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న చిల్లపల్లి మోహన్‌రావు పదవీకాలం గతేడాది డిసెంబర్‌తో ముగిసింది. ఆయన స్థానంలో చిరంజీవిని ప్రభుత్వం నియమించింది. బుధవారం సీఎం జగన్ చేతుల మీదుగా ఆయన నియామక ఉత్తర్వులు అందుకుంటారు.

అప్పుల రాష్ట్రంలో ఏపీ

పెరిగిన ఆకలి చావులు
నిరాశాజనకంగా ప్రాంతీయ పార్టీల పాలన: మురళీధరన్

విశాలాంధ్ర–భీమవరం: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ఐదవస్థానంలో ఉందని, త్వరలోఏ మూడో స్థానానికి చేరుకోనున్నదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, బీజేపీ ఏపీ ఇంచార్జీ వి.మురళీధరన్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. మురళీధరన్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీల పాలన నిరాశాజనకంగా ఉందన్నారు. గత టీడీపీ పాలన అవినీతిమయంగా సాగిందని, మాజీ సీఎం చంద్రబాబు అనవసరంగా కేంద్రంపై విమర్శలు చేశారన్నారు. ప్రస్తుత జగన్ పాలనలో రాష్ట్రం అప్పులబారిన పడిందని విమర్శించారు. రూ.4లక్షల కోట్లు అప్పులు చేసినాగానీ ఏపీలో ఆకలి చావులు పెరిగాయని మురళీధరన్ అన్నారు. ఉద్యోగులు గవర్నర్‌ను కలిస్తే ప్రభుత్వం కక్షకట్టడం ఏమిటని ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో వైసీపీ పాలనపై ఛార్జిషీట్‌తో బీజేపీ ప్రజల్లోకి రాబోతుందని చెప్పారు. జాతీయ అజెండాతో వచ్చే బీజేపీని ప్రజలు ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని విన్నవించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ ఏపీలో అవినీతి, కుటుంబ, వారసత్వ రాజకీయాలకు దూరంగా సమరశంఖం పూరిస్తున్నామన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో అవినీతి తప్ప మరేమీలేదని, జగన్ నవరత్నాలు ఎక్కువో లేక మోదీ సంక్షేమమా అన్నది తేల్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ పొత్తు రాష్ట్రప్రజలతో తప్ప పార్టీలతో కాదన్నారు. జీవో 1పై జగన్ సర్కార్ వైఖరి సరైనది కాదనిచ ఇలాంటి జీవోలుంటే జగన్ పాదయాత్ర చేసేవారా అని వీర్రాజు ప్రశ్నించారు. రేషన్ బియ్యం, ఎస్ఆర్ఈజీఎస్‌లలో అక్రమాలపై, రైతు క్షేమం కోసం, సర్పంచ్‌ల సమస్యలపైనా, మార్చి 10 నుంచి 30 వరకూ పాదయాత్రతో బీజేపీ చేయనున్నదన్నారు. కేంద్రమంత్రి భారతి ప్రవీణ్ పవార్, ఎంపీలు జీవీఎల్ నరసింహారావు, సీఎంరమేష్, ఎమ్మెల్సీ మాధవ్, విష్ణు కుమార్ రాజు వక్తల్లో ఉండగా బీజేపీ నేతలు పాకా సత్యనారాయణ, శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

న్యాయం జరగాలనే కోరుకుంటున్నా...

వివేకా హత్యకేసుపై అవినాశ్‌రెడ్డి

విశాలాంధ్ర–పులివెందుల: మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో న్యాయం జరగాలని కోరుకుంటున్నట్లు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి అన్నారు. ఈ కేసులో సీబీఐ అధికారులు నోటీసులు జారీ కావడంతో ఆయన మంగళవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం గండిక్షేత్రంలో విలేకరులతో మాట్లాడారు. రెండున్నరేళ్లుగా తనపై. తన కుటుంబంపై మీడియాలోని ఓ వర్గం అసత్య ప్రచారం చేస్తోందన్నారు. తన వ్యవహారశైలి జిల్లా ప్రజలకు తెలుసన్నారు. ఈ కేసులో నిజాలు నిగ్గుతేలాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం తనకు సీబీఐ నోటీసులు అందాయని, నాలుగురోజుల పాటు ప్రజాహిత కార్యక్రమాలు ఉన్నందున తర్వాత హాజరవుతానని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని అధికారులకు చెప్పినట్లు అవినాష్ రెడ్డి తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు ఎఫ్ఆర్ఎస్ మినహాయింపు

ఆసుల రంగనాయకులు, రవికుమార్ డిమాండ్

విశాలాంధ్ర–విజయవాడ: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని మున్సిపల్ కార్మికులకు మినహాయించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి.రవికుమార్ మాట్లాడారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ అమలు చేస్తోందని, దీనిలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల ఉద్యోగులకూ అమలు చేస్తోందని రంగనాయకులు తెలిపారు. అయితే మున్సిపల్ రంగంలో పనిచేసే కార్మికులు నూటికి 99 శాతం మంది నిరక్షరాస్యులని, అలాంటి వారికి ఎఫ్ఆర్ఎస్ అమలు చేయడం అభ్యంతరకరమన్నారు. పారిశుధ్య కార్మికులకు గతంలో మాదిరిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల వద్ద హాజరు వేసుకునేందుకు అనుమతించాలని కోరారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వకుండా వారితో వెట్టిచాకిరి చేయిం చుకుంటున్నారని విమర్శించారు. వారికి కనీస వేతనం రూ.18500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. బి.రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా జనవరి 26న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. జనవరి 28న మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, జనవరి 30న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 8న ఆర్డీఓ కార్యాలయాల ముట్టడి, ఫిబ్రవరి 15న టూల్ డౌన్ సమ్మె చేపట్టనున్నట్లు వివరించారు.

లోకేశ్ పాదయాత్ర... వైసీపీకి అంతిమ యాత్ర

అచ్చెన్నాయుడు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: యువగళం పాదయాత్రపై ఆంక్షలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభద్రతాభావానికి అద్దం పడుతున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు విమర్శించారు. లోకేశ్ పాదయాత్రతో వైసీపీ పాలనకు అంతిమయాత్ర మొదలైనట్టేనని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ 1983 తరహాలో ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. ‘లోకేశ్ పాదయాత్రను ప్రకటించినప్పటి నుంచే జగన్ అండ్ కోకి ఓటమి భయం పట్టుకుంది. అందుకే రాష్ట్ర పాలనను గాలికొదిలేసి పాదయాత్రను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. పాదయాత్రకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఆంక్షలు విధించటం సరికాదు. సీఎం జగన్ పర్యటనలకు ముళ్ల కంచెలు పెట్టి మరీ రక్షణ చర్యలు చేపడుతున్న పోలీసులు లోకేశ్ పాదయాత్రకు ఆంక్షలు విధించటం ఏంటి? బందోబస్తు బాధ్యత పోలీసు వ్యవస్థకు లేదా? జగన్ పాదయాత్రకు టీడీపీ ప్రభుత్వం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంది. నేడు జగన్ ప్రభుత్వం లోకేశ్ పాదయాత్రకు అడుగడునా అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రతిపక్ష నేతలకు పాదయాత్ర చేసే హక్కు లేదా? నాడు చంద్రబాబు నాయుడు ఇలాగే వ్యవహరిస్తే జగన్ పాదయాత్ర చేసేవారా? అధికారంలోకి వచ్చేవారా? అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా పాదయాత్రను అడ్డుకోలేరని, వైసీపీ పాలనలో దగా పడ్డ ప్రజలంతా లోకేశ్ రాక కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.

ప్రయాణికుల సౌకర్యాలపై రాజీవద్దు

దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్

విశాలాంధ్ర–విజయవాడ (గాంధీనగర్): దక్షిణమధ్య రైల్వేలో ఎంతో ప్రాధాన్యత కలిగిన స్టేషన్‌గా ఉన్న విజయవాడ రైల్వేస్టేషన్ ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మంగళవారం పరిశీలించారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. స్టేషన్ పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ గదులు, ఫుడ్‌కోర్టుతో పాటు ప్రయాణికులకున్న సౌకర్యాలనూ సమీక్షించారు. దేశీయ పరిజ్ఞానంతో తయారైన సెమీ–హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల అనుభవం, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రైలులోని ఆన్–బోర్డు సిబ్బందితో మాట్లాడారు. రైలులో భద్రత, క్యాటరింగ్ ఏర్పాట్లను సమీక్షించారు. ప్రయాణికులకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. ఖమ్మం–వరంగల్ స్టేషన్ల మధ్య రైలింజిన్‌లో ప్రయాణించిన ఆయన ట్రాక్‌ను, లోకో పైలట్లు, ఇతర సిబ్బంది అనుసరిస్తున్న భద్రతా విధానాలను, సిగ్నల్ వ్యవస్థను పరిశీలంచారు. జీఎం కుమార్ వెంట డీఆర్ఎం శివేంద్రమోహన్, ఇతర అధికారులు ఉన్నారు.

ఆ చర్చ మంచి పరిణామం కాదు

న్యాయవ్యవస్థలో భిన్నాభిప్రాయాలపై లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సమాజంలో చీలిక, రాజ్యాంగబద్ధ వ్యవస్థల మధ్య ఘర్షణ, కడకు న్యాయ వ్యవస్థలో నెలకొన్న భిన్నాభిప్రాయాలు ప్రజల మధ్య చర్చనీయాంశంగా మారడం ఏ మాత్రం ఆహ్వానించదగ్గ పరిణామం కాదని సామాజిక ఉద్యమకారుడు టి.లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్న ఆలోచనలు, దృక్పథాలు సహజమని, మెరుగైన సమాజ నిర్మాణానికి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. కానీ రాజ్యాంగబద్ధ వ్యవస్థల్లో అంతరంగికంగా జరగాల్సిన వ్యవహారాలు బహిరంగ చర్చకు దారితీస్తే సమాజంపై దుష్ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. పాలకవర్గాలు ఈ పరిణామాన్ని కోరుకుంటాయని, కానీ రాజ్యాంగంబద్ధ వ్యవస్థల పట్ల ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఉచితాలతో రాష్ట్రం అప్పులపాలు

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు: ఉచిత సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాలా తీసిందని, ప్రజలకు మంచి పాలన అందించడలో జగన్ సర్కార్ విఫలమైందని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవుసిన్హా చౌహాన్ విమర్శించారు. మంగళవారం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్‌తో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను కూడా సక్రమంగా ఖర్చు చేయకుండా పక్కదారి పట్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణానికి ఇస్తున్న నిధులను కూడా సక్రమంగా లబ్ధిదారులకు ఇవ్వడం లేదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చుకొని తామే చేసినట్లుగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. గ్రామ స్వరాజ్యం అభివృద్ధి చెందాలని సర్పంచ్‌లకు కేంద్రం నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిధులు డ్రా చేసుకోవడం దారుణమన్నారు. వలంటీర్లను పెట్టుకొని ప్రభుత్వం గురించి ప్రచారం చేసుకుంటుందన్నారు. నేడు ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం కోల్పోయారని అన్నారు. బీజేపీ పార్టీ నిర్ణయం మేరకు కేంద్ర మంత్రులు రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాల్లో రెండు రోజులు పర్యటించడానికి వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి, డాక్టర్ పార్థసారథి, వినిషారెడ్డి తదితరులు ఉన్నారు.

శంబర పోలమాంబ జాతర ప్రారంభం

విశాలాంధ్ర–పార్వతీపురం/మక్కువ: శంబర పోలమాంబ తల్లి సిరిమానోత్సవం మంగళవారం ప్రారంభమయింది. ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవాన్ని చూడడానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం జన్ని వీధిలో ఉండే ప్రధాన ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం సిరిమాను రథాన్ని జన్నిపేకాపు రామారావు అధిష్టించారు. గిరడ, కరణం, నాయుడు కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద తొలి పూజలకు ఆగి, అనంతరం పనుకు వీధి, ఎస్సీ కాలనీ, గొల్ల వీధి, గాంధీనగర్ మీదుగా తిరిగి ఆలయం ముందు నడి వీధిలో నిలిపి వేశారు. సిరిమాను ఊరేగింపులో పోలీసు శాఖ రోప్ ఏర్పాటుతో పాటు డ్రోన్లు ద్వారా పర్యవేక్షణ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసి పోలీసు ఉన్నతాధికారులు దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. విజయనగరం జిల్లా ఎస్పీ దీపిక పాటిల్, పార్వతీపురం జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, డీఎస్పీలు సుభాష్, హరితచంద్ర, నాగేశ్వరరావు, కృష్ణారావు, ఎస్సీ సీఐ శ్రీనివాసరావు, సాలూరు సీఐ ధనంజయ నాయుడు, నాగేశ్వరరావు, ఎస్ఐ పైడిరాజు దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. అమ్మవారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్న దొర, రాష్ట్ర స్పెషల్ సెక్రెటరీ టి.ఎస్.ఎన్.మూర్తి, విజయనగరం జిల్లా ఎస్పీ దీపిక పాటిల్, పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, మన్యం జిల్లా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ సుధారాణి, పార్వతీపురం ఆర్డీఓ హేమలత, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, విద్యుత్ శాఖ సీజీఎం మహిలామని, ఎస్ఈ పి.నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే భంజదేవ్, కమిటీ చైర్మన్ పూడి దాలినాయుడు తదితరులు దర్శించుకున్నారు.

ప్రభుత్వ గిరిజన జాతరగా గుర్తించేందుకు కృషి : డిప్యూటీ సీఎం రాజన్నదొర

శంబర పోలమాంబ జాతరన రాష్ట్ర ప్రభుత్వ గిరిజన జాతరగా గుర్తించేందుకు కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి.రాజన్న దొర తెలిపారు. మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద గిరిజన జాతర శంబర పోలమాంబ జాతరన్నారు. సంక్రాంతి పండుగ తరువాత 11 వారాలపాటు జరిగే జాతర విశిష్టతను సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లానన్నారు. భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లు, ఇతర పనుల నిమిత్తం కొంత నిధులను విడుదల చేయమని కోరానన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. ఆయనతో పాటు మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాస నాయుడు, మావుడి రంగునాయుడు, మావుడి తిరుపతినాయుడు, పూడి దాలి నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు, పోలమాంబ ట్రస్టు సభ్యులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయనకు పార్వతీపురం ఆర్డీఓ హేమలత, డీఎస్పీ సుభాష్, ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

సంపాదకీయం

తడి ఆరుతున్న పచ్చికబయళ్లు

ద్రవ్యోల్బణం, జనం దగ్గర కొనుగోలుశక్తి లేక గిరాకీ మందగించడం, ఉక్రెయిన్ యుద్ధం – ఇలా కారణాలు ఎన్ని చెప్పినా ఈ మాటలన్నింటి సారాంశం ఒక్కటే. "పెట్టుబడిదారీ" సంక్షోభం అంతకంతకూ ముదురుతోంది. అమెరికాలోని కార్పొరేట్ రంగం తన ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే క్రమంలో భాగంగా భారీస్థాయిలో ఉద్యోగులను తొలగిస్తోంది. రోడ్డునపడ్డ ఉద్యోగుల సంఖ్య లక్షల్లోఉంది. ఉద్యోగాల్లో కోత పెట్టడం వచ్చే కొద్ది రోజుల్లో మరింత తీవ్రం కావచ్చు. అనుకోకుండా ఉద్యోగం ఊడితే ఆ ఉద్యోగి ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం కావడమే కాక మానసిక వ్యథ ఇనుమడిస్తుంది. ఆ ఉద్యోగి కుటుంబం కూడా వికలమై పోతుంది. ఉద్యోగులను తొలగించడం సాంకేతిక రంగంలోనే అధికంగా ఉంది. ప్రతి రోజూ ఏదో ఓ కంపెనీ వందలు, వేల సంఖ్యలో ఉద్యోగులను వదిలించుకుంటోంది. ఉద్యోగులకు ఉద్వాసన చెప్పడం 2022లోనే ప్రారంభం అయింది. కానీ ఈ ఏడాది నూతన సంవత్సర సంబరాల ప్రభావం తగ్గకముందే ఉద్యోగం ఊడిందన్న కబురు కలవరపరుస్తోంది. 2001లో డాట్ కామ్ గాలిబుడగ బద్దలైనప్పటికన్నా ఇప్పుడు ఉద్యోగాలు ఊడడం విపరీతంగా పెరిగిపోతోంది. ఖర్చులు తగ్గించుకోవడం కోసం వాల్‌స్ట్రీట్‌లోని అనేక బ్యాంకులు ఉద్యోగులను సాగనంపుతున్నాయి. ఉద్యోగాలు కోల్పోతున్న వారి తప్పేమీ లేకుండానే నిరుద్యోగులుగా రోడ్డెక్కవలసి వస్తోంది. అంటే తిమింగలం లాంటి పెట్టుబడిదారీ వ్యవస్థ అనేక ఉద్యోగాలను మింగేస్తోంది. ఈ ఉద్యోగాలు ఊడగొట్టడం నిత్య వ్యవహారంగా తయారైంది కనక అమెరికాలో ఎన్ని ఉద్యోగాలు ఊడాయి అని కచ్చితంగా లెక్కకట్టడం కష్టమే.

ఒక అంచనా ప్రకారం 3,12,600 మంది ఉద్యోగాలు కోల్పోయి ఉంటారని అంచనా. ఇందులో సమాచార సాంకేతికరంగంలో పనిచేస్తున్న భారతీయులే 80 వేల మంది దాకా ఉంటారు. వీరిలో ఎక్కువ మంది హెచ్.1బి వీసా మీద అమెరికా వెళ్లినవారే. వీరు రెండునెలల్లోగా మరో ఉద్యోగమన్నా చూసుకోవాలి లేదా డబ్బా దవాలు సర్దుకుని స్వదేశానికి బయలు దేరాల్సిందే. కొత్త సంవత్సరంవచ్చి నెలరోజులైనా కాలేదు కాని, 174 కంపెనీలు 56,570 మందిని ఉద్యోగాల్లోంచి తొలగించేశాయి. దిగ్గజాలనుకుంటున్న మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్, ఆల్ఫబెట్ లాంటి కంపెనీలే 51,000 మందికి ఉద్వాసన చెప్పాయి. ఆల్ఫబెట్ కంపెనీ 12,000 మందిని, మైక్రోసాఫ్ట్ 10,000 మందిని, అమెజాన్ 18,000 మందిని, సేల్స్‌ఫోర్స్ కంపెనీ 7,000 మందిని నిరుద్యోగుల్ని చేసింది. ఉద్యోగులను తగ్గించడం కేవలం బడా సాంకేతిక సంస్థలకే పరిమితం కాలేదు. మీడియా సంస్థలు, వాణిజ్య సంస్థలు అదే దారిలో నడుస్తున్నాయి. మన దేశంలో బాగా పరిచితమైన జొమాటో, ట్విట్టర్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, బైజూస్, కార్స్24 లాంటి సంస్థలలో వేలాదిమంది నిరుద్యోగ సేనలో చేరారు. గత సంవత్సరం జూన్‌లో మెటా కంపెనీలో ఉత్పత్తి వ్యవహారాల ప్రధానాధికారి క్రిస్ కాక్స్ ఆర్థికవ్యవస్థ మందగిస్తోంది కనక ఉద్యోగులు ఒక్క పొరపాటుకూడా జరగకుండా పనిచేయాలని హెచ్చరించారు. కానీ మెటా ప్రధాన కార్యనిర్వహణాధికారి మార్క్ జుకర్ బర్గ్ మాత్రం "ఈ కంపెనీలో ఉండకూడని మనుషులు ఉన్నారు" అని అసలు ఉద్దేశం బయట పెట్టారు. ఆ తరవాత జుకర్‌బర్గ్ సెప్టెంబర్‌లో కొత్త ఉద్యోగుల్ని చేర్చుకోవడం మానేశారు. కంపెనీలో పనిచేసేవారి సంఖ్య తగ్గిస్తామని కూడా చెప్పేశారు. ఈ ఏడాది మెటా కంపెనీ ఎదుగుదలకు అవకాశంఉన్న రంగాలకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సంకల్పించింది. అంటే ఆ కంపెనీలోని మిగతా రంగాలు కుంచించుకుపోక తప్పదు. ఆ కంపెనీ ఈ ఏడాదిలో ఉన్న పరిమాణంలోనైనా ఉండొచ్చు లేదా తగ్గనూ వచ్చు. మెటా కంపెనీ వాటాల ధరలు షేర్ మార్కెట్లలో గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంతటి తక్కువ ధరకు మాత్రమే అమ్ముడవుతున్నాయి.

మనదేశంలో బాగా ప్రచారంలో ఉన్న ఇంటిదగ్గరకు ఆహారం సరఫరాచేసే జొమాటో కూడా ఉద్యోగుల సంఖ్య తగ్గించాలనుకుంటోంది. ఖర్చులు తగ్గించుకుంటే తప్ప వ్యాపారం లాభసాటిగా సాగదని ఈ కంపెనీ అంచనా. ఈ కంపెనీలో ప్రస్తుతం 3,800 మంది పనిచేస్తున్నారు. కానీ 3–4 శాతం సిబ్బంది ఉపాధిపై కోత తప్పకపోవచ్చు. 2020లోనే ఈ కంపెనీ 520 మందిని అంటే దాదాపు 13శాతం ఉద్యోగులను తగ్గించేసింది. కాండెనస్ట్ అన్నది భారీ మీడియా సంస్థ. ఈ సంస్థ తరఫున వోగ్, జిక్యు, వానిటీ ఫేర్ లాంటి పత్రికలు వెలువడుతూ ఉంటాయి. ఈ కంపెనీ వోగ్ రష్యా అన్న పత్రికను రష్యాలో పంపిణీ చేయడాన్నే నిలిపివేసింది. అక్కడ 90శాతం ఉద్యోగులను వదిలించుకుంది. ఉక్రెయిన్ మీద రష్యా దాడిచేసిన తరవాత కాండెనస్ట్ రష్యా కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశారు. అనేక పెద్ద కంపెనీలు, సంస్థలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. అందుకే ఉద్యోగులకు ఉద్వాసన చెప్తున్నాయి. ఈ సంక్షోభానికి అనేక కారణాలు ఉన్నాయి. కరోనా మహమ్మారి విలయ తాండవం చేసినప్పుడు లాక్‌డౌన్ విధించిన తరవాత పరిస్థితిని అనేక కంపెనీలు ఎదుర్కోలేక పోతున్నాయి. మరోవేపు ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరుతోంది. సహజంగానే ఇది ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుంది. వ్యాపారంలో పెట్టుబడులకు కటకటగా ఉంది.

ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోతున్నందువల్ల అనేక కంపెనీలు కొత్తగా ఉద్యోగులను నియమించుకోవడాన్ని నిలిపివేశాయి. వే ఫేర్ కంపెనీ 2022 మే లోనే కొత్త ఉద్యోగులను నియమించడాన్ని 90 రోజుల పాటు నిలిపివేసింది. ట్విట్టర్‌లోనూ కొత్త ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయి. పైగా ఎలాన్‌మస్క్ ఈ కంపెనీని స్వాధీనం చేసుకున్న తరవాత ట్విట్టర్‌లో పైస్థాయి ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గించేశారు. యాజమాన్యం మారడమే దీనికి కారణం అంటున్నారు. గూగుల్‌కూడా కొత్త ఉద్యోగులకు ద్వారాలు మూసేసింది. 2022 జులై మొదటి వారంలోనే గూగుల్ ప్రధాన కార్యనిర్వహణాధికారి సుందర్ పిచాయి కొత్త ఉద్యోగాలు ఉండవని తేల్చిచెప్పారు. ఉద్యోగులను తొలగించడానికి, కొత్త ఉద్యోగాలు కల్పించక పోవడానికి వివిధ కంపెనీలు రకరకాల కారణాలు చూపుతున్నాయి. ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం, కరోనా ప్రభావం, కంపెనీల పునర్వ్యవస్థీకరణ ఆలోచనల లాంటి బోలెడు కారణాలు ఉల్లేఖిస్తున్నారు. ఇన్ని కారణాలు చూపినప్పుడు సిబ్బంది అసమర్థత అనడంకూడా ఒక కారణం అయితీరుతుంది కదా! కంపెనీలలో కొత్తగా పెట్టుబడి పెట్టేవారు తగ్గిపోతున్నారు. వీరు లాభాలు పెరిగేలా చూడాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న ఆర్థికవ్యవస్థ దిగజారుడు ధోరణి గమనిస్తే రాబోయే రోజులు మరింత దుర్భరంగా ఉండక తప్పని పరిస్థితి అనివార్యం అవుతుందనిపిస్తోంది. ఈ కారణాలుఏమైనా పెట్టుబడిదారీవ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని మాత్రం స్పష్టంగానే కనిపిస్తోంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న అంతర్నిహితమైన సూత్రమే. ఆశ్చర్యపడడం కూడా అనవసరం.

రెజ్లర్లపై లైంగిక వేధింపులు జాతికే అవమానకరం

కంచె చేనును మేసినట్లు, క్రీడాకారులకు గొడవలు పట్టించుకోవలసిన పెద్దలే మహిళా క్రీడాకారిణిలను లైంగిక వేధింపులకు గురిచేయడం చేయడం భరతజాతికే అవమానకరం. అదే నిజమైతే క్షమించారని నేరం కూడా అవుతుంది. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ లోకసభ సభ్యుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌తో పాటు కోచ్‌లు మహిళా రెజ్లర్లపై గత కొన్నేళ్లుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ప్రధాన ఆరోపణలు భారత క్రీడాభిమానులను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. కామన్వెల్త్, ఆసియా క్రీడా పోటీల్లో స్వర్ణం నెగ్గిన వినేశ్ ఫోగట్, ఒలంపిక్ పతక విజేత సాక్షి మాలిక్, టోక్యో ఓలంపిక్స్ పతక విజేత బజరంగ్ పునియాలతో పాటు మహిళా సహచర రెజ్లర్లు ఢిల్లీ వీధుల్లో నిరసన వ్యక్తం చేస్తూ దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ కూడలి వద్ద ధర్నా చేశారు. 2011 నుంచి సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్న బ్రిజ్ భూషణ్ బీజేపీ పక్షాన కైసర్‌గంజ్ లోకసభ నియోజకవర్గం నుంచి యంపీగా కొనసాగుతున్నారు. ఇలాంటి విమర్శనలనే ఫుట్‌బాల్, తైక్వాండో, ధనుర్విద్య, జిమ్నాస్టిక్స్ లాంటి క్రీడా సమాఖ్యలు కూడా ఎదుర్కొంటున్నాయి. క్రీడారంగంలో లైంగిక వేధింపులు క్రమంగా పెరగడం, సమాఖ్య భాద్యులు క్రమశిక్షణ గీత దాటడం జరుగుతూనే ఉంది.

ఇటీవలే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న హర్యానా క్రీడలు, యువజన వ్యవహారాల శాఖామంత్రి సందీప్ సింగ్ తన పదవికి కూడా రాజీనామా చేయాల్సి వచ్చిన విషయం మనం ఇంకా మరువనే లేదు. 2018లో 'మల్లాఖంబ్' క్రీడా సమాఖ్య అధ్యక్షులు ఇండోలియా కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొనడంతో సమాఖ్య అధ్యక్ష పదవిని కోల్పోవలసి వచ్చింది. గత మార్చిలో ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి పాండే తనను రేప్ చేశాడానికి ప్రయత్నించాడని హాండ్‌బాల్ క్రీడాకారుణి సీమా శర్మ ఆరోపించడం, పాండేపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేయడం జరిగింది. కేరళలోని అలపుజ్హాలోని క్రీడా హాస్టల్‌లో కోచ్ లైంగిక వేధింపులు తాళలేక ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన నలుగురు మహిళా అథ్లెట్ల విషయం మనం మరిచి పోనేలేదు. లైంగిక వేధింపులను అనుభవించిన 15ఏళ్ల అపర్ణా రామచంద్రన్ ఆత్మహత్య చేసుకుంది. 2022 జూన్‌లో శిక్షణ పొందుతున్న మహిళా సైక్లిస్ట్‌ను లైంగికంగా వేధించిన కోచ్ ఆర్‌కె శర్మ తన పదవిని కోల్పోవలసి వచ్చింది. జూన్ 2022లో మహిళా సెయిలర్స్ కూడా ఇలాంటి వేధింపులనే సీనియర్ కోచ్‌ల నుంచి ఎదుర్కొన్నారు.

ఇటువంటి అవమానకర ఘటనలు ప్రభుత్వ క్రీడా ప్రాంగణాలు, ప్రైవేట్ క్రీడా అకాడమీల్లోనూ పొడచూపడం విచారకరం. 2010–2019 మధ్య కాలంలో ఇలాంటి లైంగిక వేధింపుల ఘటనలు 24స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రాల్లో 45 జరగగా, అందులో 29 మంది కోచ్‌లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ కేసులు ఇప్పటికీ విచారణలను నోచుకోనే లేదు. ఇలాంటి ఆరోపణలు రుజువైతే కఠిన శిక్షలు కూడా వేయడానికి నిబంధనలు సహకరించడం లేదు. స్పోర్ట్స్ ఫెడరేషన్ బాధ్యులు ఆటలపై కాని, క్రీడాకారులపైగాని ఎలాంటి శ్రద్ధను చూపడం లేదని, వారు అశ్రితపక్షపాతులుగా జట్టు ఎంపికలో క్రీడా సామర్థ్యాలకు విరుద్ధంగా స్వంత వారికి పెద్ద పీటలు వేస్తున్నారన్న ఆరోపణలుఉన్నాయి. భారత దేశానికి చెందిన వివిధ క్రీడా సమాఖ్యల్లో ఆరోపణలను పరిష్కరించడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీలు కూడా నియమించలేదనేది వాస్తవం. మార్చి 2021లో లుధియానాకు చెందిన మైనర్ సైక్లిస్ట్ బాలిక లైంగిక వేధింపుల కారణంగా శిబిరాన్ని వదిలి వెళ్ళిపోవలసి వచ్చింది. ఈ విషయంలో సకాలంలో స్పందించని స్టేడియం అధికారిణి జ్యోతిపై చర్యలు తీసుకోకపోగా పదోన్నతి కల్పించి, స్థాన చలనం కలిగించడం వివాదానికి కారణమైంది.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
సెల్: 9949700037

రాజ్యాంగ పతనంలో రాజకీయుల పాత్ర

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

రాజ్యాంగ ముసాయిదాను సమర్పిస్తూ ముసాయిదా కమిటీ అధ్యక్షులు అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాణసభ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ ప్రజలను ఇలా హెచ్చరించారు. "పాలకులు చెడ్డవారైతే మంచి రాజ్యాంగమైనా చెడుగా మారుతుంది. మంచివారైతే రాజ్యాంగం చెడ్డదైనా మంచిగా మారుతుంది. రాజకీయ పక్షాలమీద రాజ్యాంగ వ్యవస్థల పనితీరు ఆధారపడుతుంది. దేశం మతాతీతంగా ఉండాలి. మతం రాజ్యాన్ని అతిక్రమిస్తే స్వాతంత్ర్యం దూర మౌతుంది. రాజకీయపక్షాలపై రాజ్యాంగవ్యవస్థల పనితీరు ఆధారపడుతుంది" అంబేద్కర్. "పాలకులు యోగ్యులు, సమగ్రతా నిబద్ధులు, గుణవంతులైతే లోపయుక్త రాజ్యాంగాన్ని ఉత్తమంగా మార్చగలరు" రాజేంద్ర ప్రసాద్. భవిష్యత్ ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి, పాలనావిధానాలపై వీరికి ఆరోజే అనుమానం కలిగింది. 'భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోడానికి, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యం చేకూర్చుటకు, వారి వ్యక్తి గౌరవం, జాతి ఐక్యత, అఖండతలను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుటకు సత్యనిష్ఠా పూర్వకంగా తీర్మానించి 1949 నవంబరు 21న రాజ్యాంగ పరిషత్తులో పరిగ్రహించి శాసనంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము." సుప్రీంకోర్టు ఈ పీఠికను రాజ్యాంగ మౌలిక సిద్ధాంతంగా ప్రకటించింది. చట్టాలు, రాజ్యాంగ సవరణలు పీఠికలోని అంశాలకు కట్టుబడి ఉండాలన్నది. రాజ్యాంగ ముసాయిదా, నిర్మాణసభల్లో మితవాదులు అంబేద్కర్‌కు అడ్డంకులు కల్పించారు. రాజ్యాంగంలో తమ ఇష్టాలు చేర్చడానికి వత్తిడి చేశారు. ఆయన వాపోయినట్లు రాజ్యాంగం రాజకీయ సమానతనిచ్చింది. సామాజిక, ఆర్థిక సమానతలనివ్వలేదు. రాజ్యాంగం బ్రిటిష్ పాలక వ్యవస్థలు, రాజభక్తి, దేశద్రోహం, నేరవిచారణ, శిక్షాస్మృతులను కొనసాగించింది. 1945 ముందరి దోపిడీ ప్రపంచీకరణ, తర్వాతి వాణిజ్య ప్రపంచీకరణ, 1991 తర్వాతి సామ్రాజ్యవాద ప్రపంచీ కరణలను అడ్డుకునే నిబంధనలు రాజ్యాంగంలోలేవు. ఆదేశికసూత్రాల అధికరణ 47 మత్తుపదార్థాలను, 48 గోవధను నిషేధించాలన్నాయి. ప్రభుత్వం 47ను అశ్రద్ధచేసి, 48తో రాజ్యాంగానికి హైందవతత్వాన్ని పులుముతోంది.

గత ప్రభుత్వాల రాజ్యాంగ అపసవ్యంలో నేరస్థుల రాజకీయాకరణ, రాజకీయ నేరమయం పెరిగాయి. రాజ్యాంగపీఠికను అశ్రద్ధచేశారు. సామాజిక దృక్పథం, త్యాగంతో నిండవలసిన రాజకీయాలు లాభసాటి లూటీవ్యాపారంగా మారాయి. రాజ్యాంగ విలువలు దిగజారాయి. ఇందిర 1975లో రాజ్యాంగ అధికరణ 352(1)తోఎమర్జెన్సీ విధించారు. దీనితో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బలహీనపడ్డాయి. నియంతృత్వ పోకడ మొదలైంది. కాని సంఘ్ తన భావజాలాన్ని ప్రచారంచేసింది. జనసంఘ్, సంఘపరివార్ సంస్థలు బల పడ్డాయి. జనతా ప్రభుత్వంలో అధికారం దక్కింది. ఆ తర్వాత ఇందిరకు, సంఘ్‌కు ఇచ్చిపుచ్చుకోవడం కుదిరింది. అది ఇందిరకు సహకరించింది. ఆమె సంఘ్ గంగాజల్ యాత్ర ప్రారంభించారు. ప్రభుత్వ కమిటీల్లో, చర్చల్లో జనసంఘ్‌కు ప్రాతినిధ్యం కల్పించారు. రాజీవ్ హిందువులను దువ్వడానికి హిందుత్వ మెతకవైఖరి వహించారు. అయోధ్య ఆలయ తలుపులు తెరిపించారు. అయోధ్యనుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించి మందిర్ నిర్మిస్తా మన్నారు. షాబానో మనోవర్తి సుప్రీంకోర్టు తీర్పును తిరగతిప్పి ముస్లిం మగాళ్లకోసం చట్టం చేశారు. హిందుత్వవాద ప్రధాని నరసింహారావు బాబ్రీమసీదు కూల్చివేతకు మౌనంగా సహకరించారన్న ఆరోపణ ఉంది. అయోధ్యమందిర్ నిర్మాణం, అలౌకిక పాలనకు పునాదివేశారు. వాజ్‌పేయి ప్రజల ఆస్తుల అమ్మకాలను చట్టబద్ధం చేశారు. ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్లకు అమ్మారు.

మోదీ గో(సూ) మూత్ర రాజ్యాంగం

విద్యాలయాల్లో అశాస్త్రీయాంశాలను ప్రవేశ పెట్టారు. విద్యావ్యవస్థ కాషాయీకరణతో రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథానికి నీళ్ళొదిలారు. దేశాన్ని సాంస్కృతికంగా కలుషితం చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి నరమేధాన్ని సహించి, రాజకీయ మతోన్మాదాన్ని ప్రోత్సహించారు. మతపాలనకు నాంది పలికారు.

ఆర్.ఎస్.ఎస్.(సంఘ్) రాజ్యాంగ మూలసిద్ధాంతాలకే వ్యతిరేకం. రాజ్యాంగం స్థానంలో 'మనుస్మృతి' అమలు చేయాలంటుంది. "రాజ్యాంగంలో మనదైన అంశమేలేదు. మనుస్మృతి ప్రపంచసమ్మతి, ప్రశంస, యాదృచ్ఛిక విధేయత, అనుగుణ్యతలను పొందింది. రాజ్యాంగాన్ని శుభ్రపరచాలి. ఏకీకృత ప్రభుత్వం ఏర్పరచాలి" హిందుత్వ భావజాలవాది గోల్వాల్కర్ వ్యాఖ్యానం. "రాజకీయాలను హైందవీకరించండి. హిందుత్వాన్ని సైనికీకరించండి" అన్నారు సావర్కర్. మోదీసర్కార్ ప్రజా రాజ్యాంగాన్ని పాలక పక్షపాత గ్రంథంగా మార్చింది. సర్వసత్తాకస్థానంలో ఏకసత్తాకం తెచ్చింది. సామ్యవాదం అసమానతలను నిరోధిస్తుంది. లౌకికత్వం రాజ్యాన్ని, మతాన్ని వేరుచేస్తుంది. ప్రజలను సోదరులుగా, మనుషులుగా తీర్చిదిద్దుతుంది. నేటిప్రభుత్వం ఈ పదాలను రాజ్యాంగం నుంచే తొలగించాలని ప్రయత్నిస్తోంది. సామ్యవాదం మరిచి అసమానతలనుపెంచి కార్పొరేట్ల ప్రభుత్వంగా మారింది. ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలకు తిలోదకాలిచ్చింది. హేతు, భౌతిక, మానవ వాదాలను ప్రోత్సహించటం లౌకిక రాజ్యలక్షణం. గత ప్రభుత్వాల్లో లౌకికభావం నిర్వీర్యమైంది. బీజేపి సర్కార్ హిందూమత విశ్వాసాన్ని దేశభక్తిగా మార్చింది. లౌకికత్వాన్ని హిందుత్వానికి ముడేసి భారతీయతను హిందుత్వంగా మార్చింది. సంస్థలన్నిటినీ సంఘ్ సంకర తాత్వికులతో నింపి, బలహీనపర్చింది. నియంతృత్వ ధోరణలతో రాజ్యాంగాన్ని ఎగతాళి చేసింది. పౌరసత్వ సవరణ చట్టంలో రాజ్యాంగ సమానత్వ అధికరణలు 14–18లను తిరస్కరించింది. సామాజిక సౌభ్రాతృత్వాన్ని మంటగలిపింది. తన నిరంకుశ స్వేచ్ఛను, కార్పొరేట్ల దోపిడి స్వేచ్ఛనుపెంచింది. ప్రజలస్వేచ్ఛను హరించింది. తమ దుశ్చర్యలను, తాత్వికతను ప్రశ్నించిన వారిని తప్పుడు కేసులతో అరెస్టు చేయించి, జాతి నిర్మాతల గౌరవాన్ని కించపరిచింది. లౌకికత్వం, అంతర్జాతీయత, బహుళ సంస్కృతులతో పూర్వ కీర్తిప్రతిష్ఠలు నశించాయని ఫాసిజం నమ్మకం. దీనికి మతోన్మాదం తోడ్పడింది. భారతీయ సౌభ్రాతృత్వం, అంతర్జాతీయ మానవత్వం లేకుండా దేశ సమగ్రత, సమైక్యతలకు సంపూర్ణత లేదు. రాజ్యాంగ మనుగడ లేదు.

బిజెపిసర్కార్ లక్షల్లో సంఘ్‌కార్యకర్తలను పోలీసులుగా నియమించుకుందని, న్యాయ వాదులుగా నమోదుచేసుకుందని మంగళూరు బిజెపి శాసనసభ్యుడు ఏడేళ్ల క్రితమే వెల్లడించారు. న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి తూట్లు పొడిచింది. ఇటీవలి కోర్టు తీర్పులన్నీ బిజెపి కోరుకున్నట్లే రావడం యాదృచ్ఛికం కాదని బిజెపి నాయకు లన్నారు. మీడియా పాలకపక్ష కార్పొరేట్ల చేతుల్లో చేరింది. విద్యార్థులపై గూండాల దాడులు చేయించింది. దేశద్రోహ కేసులు బనాయించింది. పోలీసులు, న్యాయవాదులు గూండాలలో చేరారు. ప్రజాసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే చౌర్యోన్మాదస్వామ్యంగా ప్రజాస్వామ్యాన్ని మార్చింది. మతోన్మాదంతో రాజ్యాంగాన్ని ధిక్కరించింది. మతవాదం ఫాసిజానికి దారితీస్తోంది. జైళ్ళలో ఉండాల్సినవారు కుర్చీలెక్కి రాజ్యాంగ బాధ్యత మరిచారు. ఆ బాధ్యతను తలకెత్తుకొన్న సమాజనిర్మాతలను జైళ్ళలో కుక్కారు. గతంలోలేని రీతిలో, స్థాయిలో రాజ్యాంగం ప్రమాదంలో పడింది. ఈ సర్కార్ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్లు అనిపించవచ్చు. కాని సంఘ్ ఆశయమైన రాజ్యాంగశుద్ధి 'పవిత్ర కార్యం' నిర్వహిస్తోంది. రాజ్యాంగాన్నే అవమానిస్తూ భారతీయతను, పాలనార్హతను కోల్పోయింది. అంబేద్కర్ అనుమానాలు నిజాలయ్యాయి. ఆయన చెప్పినట్లు స్వాతంత్ర్యం, రాజ్యాంగాల రక్షణ బాధ్యత ప్రజలదే. ప్రత్యామ్నాయ పార్టీలు సైద్ధాంతిక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక పద్ధతులతో ఎదగాలి. విద్యార్థులు, యువత, పౌరులకు రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు, పౌరజ్ఞానం, రాజ్యాంగవక్రీకరణ నష్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్గస్వభావం, సామ్యవాదం, ఫాసిజంలపై అవగాహన కల్పించాలి. ప్రజాస్వామ్యం, రాజ్యాంగా లను సమాజానికి అనుసంధానించి ప్రచారం చేయాలి. బుద్ధిజీవులు రాజ్యాంగ రక్షణలో భాగస్వాములు కావాలి. ఇందిర ఎమర్జెన్సీని ఏటా జూన్ 25న నిరసిస్తాం. నేటి అప్రకటిత అత్యవసరస్థితిని రోజూ నిరసించాలి. కార్మికవర్గాన్ని పాలకవర్గంగా నిలబెట్టడమే విప్లవానికి తొలిమెట్టని కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్ పేర్కొన్నారు. శ్రామికవర్గ ప్రజాస్వామ్యంలో కార్మికులే పాలకులు. రాజ్యాంగం మంచిదైనా కాకున్నా ఆ రాజ్యం ప్రజారాజ్యమే.

అల్ ఇండియా ప్రొగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
చరవాణి: 9490 20 4545

పెన్షన్ స్కీంపై సుప్రీం తీర్పు-పర్యవసానాలు

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపియఫ్ఓ) దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై 2022 నవంబర్ 4వ తేదీన సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. చాలాకాలంగా ఎదురు చూస్తున్న తీర్పు ఇది. ఆ తీర్పులోని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి. నెలకు రూ.15,000ల వేతనంపై అప్పటికే చందా చెల్లిస్తున్నవారికి, ది.4.11.2022 తర్వాత 4 మాసాలలోగా ఆప్షన్ ఇచ్చే ఉద్యోగులకు తీర్పు ఫలితం పరిమితం. ఆ తర్వాత, కేంద్రప్రభుత్వం రూల్స్ సవరించే వరకు నెలకు రూ.15000లు వేతనం పరిమితి కొనసాగుతుంది.

ఇ.పి.యస్ 95 పథకం సుదీర్ఘ ప్రయాణం 1) ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ యాక్ట్ 1952కు సవరణ చేయడం ద్వారా ది 16.11.1995 తేదీన ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం అమల్లోకి తీసుకువచ్చారు. పెన్షనబుల్ వేతనాన్ని పెన్షనబుల్ సర్వీస్‌తో హెచ్చించి, 70తో భాగించటంద్వారా పెన్షన్ లెక్కింపు జరగాలని నిర్దేశించారు. పెన్షనబుల్ వేతనం మొదట్లో రూ.5,000లకు పరిమితం. ఆతర్వాత కొంత కాలానికి దీన్ని రూ.6,500లకు పెంచారు. 2) 16.3.1996 తేదీన ఇ.పి.యస్ 1995 సెక్షన్ 11(3)కు ఒక సవరణ తీసుకువచ్చారు. దీని ప్రకారం, యజమాని, ఉద్యోగి సంయుక్తంగా ఒక డిక్లరేషన్ ఇవ్వాలి. తద్వారా, మొత్తం వేతనంపై (పైన తెలిపిన పరిమితితో నిమిత్తం లేకుండా) 8.33శాతం చందా చెల్లిస్తే, ఎటువంటి పరిమితి లేకుండా, ఆ ఉద్యోగి అధిక పెన్షన్ పొందగలడు. 3) వాస్తవ వేతనంపై చెల్లించిన చందా ఆధారంగా అధిక పెన్షన్ కొరకు చేసిన దరఖాస్తుల కారణంగానూ, ఆ దరఖాస్తులు చెల్లుబాటుకావనే వైఖరిని ఈపియఫ్ఓ తీసుకున్నందున ఆర్.సి. గుప్తాకేసు తలెత్తింది. ఈపియఫ్ఓ వైఖరిని సుప్రీంకోర్టు కొట్టి వేసింది.

4) ఆ తర్వాత, 1.9.2014 నుండి అమల్లోకి వచ్చే లాగా ఈపియఫ్ఓ ఒక సవరణ తీసుకువచ్చింది (GSR 609E). వాస్తవ వేతనంపై చెల్లించే చందా ఆధారంగా అధిక పెన్షన్‌ను అనుమతించే సెక్షన్ 11(3) ప్రొవిజన్‌ను తొలగించారు. సెక్షన్ 11(4) పేరాను చేర్చారు. గతంలో, ఒక ఉద్యోగి ఉద్యోగం నుండి వెళ్లిపోయేనాటికి ముందు 12 మాసాల సగటు వేతనాన్ని పెన్షనబుల్ వేతనంగా పరిగణించేవారు. ఈ 11(4) సవరణ ద్వారా సగటు వేతనాన్ని 60 మాసాలుగా నిర్ణయించారు.

సెక్షన్ 11(4) సవరణ ద్వారా, పెన్షనబుల్ వేతనంపై గల పరిమితిని రూ.6,500 నుండి రూ.15,000కు పెంచారు. అంతేగాక, 1.9.2014కి ముందు నెలకు రూ.15,000 పైగా గల వేతనంపై చందా చెల్లించేవారు, దాన్ని కొనసాగించవచ్చునని అవకాశం కల్పించింది. అయితే, యజమానితో కలిసి ఆ ఉద్యోగి తాజాగా ఒక ఉమ్మడి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఆ సంబంధిత ఉద్యోగి రూ.15,000లకు పైనగల వేతన భాగంపై 1.16శాతం మొత్తాన్ని పెన్షన్ ఫండ్‌కు జమకట్టాల్సి ఉంటుంది. నెలకు రూ.15,000లకు పైగా వేతనం పొందేవారు, కొత్తగా ఇ.పి.యస్.1995 స్కీంలో చేరరాదని అది తెలియజేసింది. 1.9.2014 తేదీ గల ఈ సవరణను కేరళ, ఢిల్లీ, రాజస్థాన్ హైకోర్టులు కొట్టి వేశాయి.

5) ఈలోగా, పైన తెలిపిన వాస్తవ వేతనంపై చందా ద్వారా అధిక పెన్షన్ ప్రయోజనం ట్రస్టుల ఉద్యోగులకు వర్తించదని ఇపియఫ్ఓ 31.5.2017 తేదీన లేఖ ద్వారా తెలియజేసింది.

6) పై హైకోర్టుల తీర్పులకు వ్యతిరేకంగా ఈపియఫ్ఓ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. అయితే, ఈ అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాగా, ఈపియఫ్ఓ రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ముగ్గురు జడ్జీల బెంచ్ దాన్ని అనుమతించలేదు. కానీ కొన్ని సూచనలు చేసింది.

ఏ) ఆర్.సి.గుప్తా తీర్పు అమల్లో ఉంటుంది. కటాఫ్ తేదీలు లేవు.

బి) ఎగ్జంప్టెడ్ ట్రస్టులు, ఎగ్జంప్టెడ్ కాని ట్రస్టులను సమానంగా చూస్తారు.

సి) ది 1.9.2014 నుండి అమల్లోగల +ూ=609జు సవరణ చెల్లుతుంది. అధిక వేతనంపై అధిక పెన్షన్‌ను సాధ్యంచేసిన సెక్షన్ 11(3) నియమంగల పేరా తొలగింపును సమర్థించింది.

డి) రూ.15,000 లకు పైగా జీతం తీసుకునే ఉద్యోగులు ఇ.పి.యస్.95 పెన్షన్ పథకంలో సభ్యులు కారాదన్న నియమం నిలిపివేశారు (స్టే).

ఇ) 12 నెలల సగటు పెన్షనబుల్ వేతనానికి బదులు 60మాసాల సగటు వేతనాన్ని తీసుకోవాలన్న నియమం చెల్లుబాటులో ఉంటుంది.

యఫ్) 1.9.2014 నాటికీ ఇ.పి.యస్. 95 స్కీంలో గల సభ్యులు రూ.15,000 లు పైగా జీతంపై చందా చెల్లింపును కొనసాగించేందుకు తమ ఆప్షన్ ఇవ్వవచ్చును. అయితే, నెలకు రూ.15,000లకు పైగా జీతం పొందే ఉద్యోగులు, తమ వేతనంపై 1.16 శాతం మొత్తాన్ని పెన్షన్‌ఫండ్‌కు జమ చేయాలి. ఈ నియమం కొట్టివేశారు. కానీ, నిధుల కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు వీలుగా, ఈ ప్రొవిజన్ ఆరు మాసాలపాటు అనామత్తులో ఉండాలి. ఈ లోగా ఉద్యోగి 1.16శాతం మొత్తాన్ని పెన్షన్ నిధికి జమచేస్తూనే ఉండాలి. నూతన చట్టం ప్రకారం దీన్ని సర్దుబాటు చేస్తారు.

జి) సెక్షన్ 11(3) క్రింద ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగి, 1.9.2014 నాటికి సర్వీస్‌లో కొనసాగుతునట్లయితే, అతనికి 11(4) పేరా సవరణ వర్తిస్తుంది.

హెచ్) పేరా 11(3) క్రింద లేదా 11(4) సవరణ క్రింద ఆప్షన్ ఇవ్వని ఉద్యోగి, 11(4) సవరణ పేరా క్రింద, తదుపరి 4 మాసాలలోపు ఆప్షన్ ఇవ్వవచ్చు.

ఐ) 1.9.2014 తేదీకి ముందు రిటైర్ అయిన ఉద్యోగి, సెక్షన్ 11(3) క్రింద ఆప్షన్ ఇచ్చి ఉండకపోతే, అట్టి ఉద్యోగులకు ఈ తీర్పువల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.

ఏఐటియూసి ఏపీ శాఖ గౌరవ అధ్యక్షులు
సెల్: 9505680120

ఎంసీడీ రణరంగం

- బీజేపీ, ఆప్ కౌన్సిలర్ల పోటాపోటీ నినాదాలు
- మార్మోగిన జైశ్రీరాం, భారత్ మాతాకీ జై నినాదాలు
- సభలో గందరగోళం
- ఢిల్లీ మేయర్ ఎన్నిక మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) సభ మరోమారు రణరంగమైంది. బీజేపీ, ఆప్ కౌన్సిలర్ల మధ్య మాటలయుద్ధం తీవ్రరూపం దాల్చింది. పోటాపోటీ నినాదాలతో సభ దద్దరిల్లింది. 'జైశ్రీరాం, భారత్ మాతా కీ జై, మోదీ మోదీ, జై భీమ్, జో బోలే సో నిహాల్, ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదాలు మార్మోగాయి. రెండు పక్షాల మధ్య వాగ్వాదంతో గందరగోళం నెలకొనడంతో సభను వాయిదా వేస్తున్నట్లు సభాపతి ప్రకటించారు. పర్యవసానంగా మేయర్‌ను ఎన్నుకోకుండానే వాయిదా ప్రక్రియ కొనసాగినట్లు అయింది.

మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు మంగళవారం జరగాల్సి ఉండగా కొందరు కౌన్సిలర్లు సభలో గందరగోళం సృష్టించడంతో ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. సభనూ సభాపతి వాయిదా వేయాల్సి వచ్చింది. తాజాగా ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సభలో మార్షల్స్‌ను అందుబాటులో ఉంచారు. లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేసిన సభ్యులతో హడావిడిగా ప్రమాణాలను సభాపతి సత్యశర్మ చేయించారు. ఆపై సభను ఉదయం 11 గంటలప్పుడు 20 నిమిషాలు వాయిదా పడింది. సభ తిరిగి మొదలైనప్పుడు 'మోదీ మోదీ' అంటూ నినాదాలు చేస్తూ బీజేపీ సభ్యులు ప్రవేశించారు. ఆపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినదించారు. ఆప్ కౌన్సిలర్ల స్థానాల వద్దకు వెళ్లి మరీ పెద్దపెట్టున నినాదాలు చేయడంతో ఆప్ సభ్యులు 'సిగ్గు సిగ్గు' అంటూ ప్రతిఘటించడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. నామినేటెడ్ సభ్యులు 'జై శ్రీరాం', భారత్ మాతా కీ జై అంటూ నినదించారు. ఇంకొందరు సభ్యులు 'జో బోలే సో నిహాల్, ఇంక్విలాబ్ జిందాబాద్, జై భీమ్' అంటూ నినాదాలు చేశారు. దీంతో సభాపతి సభను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థి తుల్లో సభ నిర్వహణ కష్టమన్నారు. రెండు వర్గాల మధ్య వాగ్వాదంతో సభలో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. నిజానికి ఈనెల 6న మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక జరగాల్సి ఉంది. ఆప్, బీజేపీ కార్పొరేటర్ల గొడవ కారణంగా ఆ ప్రక్రియ వాయిదా పడింది. మంగళవారం మరోమారు అదే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మేయర్ ఎన్నిక మరోమారు వాయిదా పడింది. ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో నెగ్గిన మున్సిపల్ కౌన్సిలర్లు, లెఫ్టినెంట్ జనరల్ నామినేట్ చేసే కౌన్సిలర్లతో ఢిల్లీ పరిధిలోని ఏడుగురు లోక్‌సభ ఎంపీలు, ముగ్గురు రాజ్యసభ ఎంపీలు, వీళ్లతో పాటు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేసే 14 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. తొలి దఫా ఏ పార్టీ అయినాగానీ మహిళా అభ్యర్థికి మాత్రమే మేయర్ పీఠాన్ని కట్టబెడుతుంది. కాగా, 15ఏళ్ల తర్వాత ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. మొత్తం 250 స్థానాలు ఉన్న ఎంసీడీలో 134 వార్డుల్లో ఆప్, 104 వార్డుల్లో బీజేపీ గెలిచింది. కాంగ్రెస్ తొమ్మిది స్థానాలకు పరిమితమైంది. మేయర్ పదవి కోసం పోటీ చేయకూడదని బీజేపీ మొదట్లో భావించిందిగానీ గెలుపు అవకాశాలు కనిపించడంతో నిర్ణయాన్ని మార్చుకొని మేయర్ అభ్యర్థిగా రేఖా గుప్తాను బరిలో నిలిపింది. ఆప్ మేయర్ అభ్యర్థిగా షెల్లీ ఒబెరాయ్ ఉంటే బ్యాకప్ అభ్యర్థిగా ఆషుఠాకూర్ ఉన్నారు. ఢిల్లీ మేయర్ పదవి ఐదేళ్లలో ఏడాది చొప్పున మారుతుం టుంది. మొదటి ఏడాది మహిళలకు రిజర్వు చేశారు. రెండో ఏడాది ఓపెన్ కేటగిరీ కింద అభ్యర్థిని ఎంపిక చేస్తారు. మూడో ఏడాది రిజర్వు విభాగం కింద, ఆ తర్వాత రెండేళ్లు ఓపెన్ కేటగిరిలో మేయర్ అభ్యర్థిని ఎన్నుకుంటారు.

తీవ్ర ఆందోళనకరం

సుప్రీం కొలీజియం తీర్మానాలపై మంత్రి రిజిజు



న్యూఢిల్లీ: ఇంటెలిజెన్స్ బ్యూరో, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ సున్నితమైన నివేదికలలోని కొన్ని భాగాలను సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగంగా ఉంచడం 'తీవ్ర ఆందోళన కలిగించే విషయం' అని న్యాయ మంత్రి కిరెన్ రిజిజు మంగళవారం అన్నారు. నిఘా సంస్థ అధికారులు దేశం కోసం రహస్య పద్ధతిలో పని చేస్తారని, వారి నివేదికలను బహిరంగపరిస్తే వారు భవిష్యత్తులో 'ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుంటారు' అని ఆయన అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కోసం ఉన్నత న్యాయస్థానం సిఫార్సు చేసిన కొన్ని పేర్లపై రా, ఐబీ నివేదికలు గతవారం బహిరంగపరచబడ్డాయి. సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానాలపై ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. నిఘా విభాగం అందించిన సమాచారాన్ని తిరస్కరించిన కొలీజియం ఈ నెల ప్రారంభంలో పేర్లను ప్రభుత్వానికి పునరుద్ఘాటించింది. 'రా, ఐబీ రహస్య లేదా సున్నిత నివేదికలను బహిరంగపర్చడం ఆందోళన కలిగించే విషయం. దీనిపై నేను తగిన సమయంలో స్పందిస్తాను' అని రిజిజు ఇక్కడ న్యాయ మంత్రిత్వ శాఖ కార్యక్రమంలో విలేకరులతో అన్నారు.

కేంద్రమంత్రి రిజిజుపై

సిబల్ వ్యంగ్యాస్త్రాలు

న్యూఢిల్లీ: అధికారాలు, పరిధులకు సంబంధించి న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం మధ్య వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. న్యాయవ్యవస్థపై కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించారు. కిరణ్ రిజిజుపై రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ విమర్శలు చేశారు. రిజిజు మరో జెమ్ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'రిజిజు రూపంలో మరో రత్నం దొరికింది. న్యాయవ్యవస్థను దెబ్బతీసేలా మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. అయితే మరి.. మీరు చేసే వివాదాస్పద వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయా..? వాటిని మీరు నమ్మొచ్చు. న్యాయ వాదులమైన మేం కాదు' అని కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిన్న ఢిల్లీలోని తీస్ హజారికోర్టుల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి రిజిజు మాట్లాడారు. 'జడ్జీలకు ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అవసరం లేదు. పనితీరుపై తనిఖీలూ ఉండవు. ప్రజలు ఎన్నుకోరు కాబట్టి న్యాయమూర్తులను తొలగించలేరు' అని పేర్కొన్న విషయం తెలిసిందే.

న్యాయవ్యవస్థ స్వాధీనమే కేంద్రం కోరుకునేది: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశంలోని అన్ని వ్యవస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు న్యాయవ్యవస్థను వశపర్చుకోవాలని చూస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. కేంద్రప్రభుత్వ చర్యలను ప్రజలు ఆమోదించబోరని ఆయన మంగళవారం తేల్చిచెప్పారు. న్యాయవ్యవస్థకు సంబంధించి కేంద్ర వర్గాలు చేస్తున్న వ్యాఖ్యలను తప్పుపట్టారు. కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలను ఖండించారు. స్వతంత్ర వ్యవస్థలన్నింటిని ఆక్రమించుకున్న కేంద్రం ఇప్పుడు న్యాయవ్యవస్థపై కన్నేసిందని కేజ్రీవాల్ ట్విట్టర్‌లో విమర్శించారు. న్యాయవ్యవస్థ విషయంలో కేంద్ర వైఖరి ఆక్షేపణీయమని, ఈ వ్యవస్థను స్వాధీనపర్చుకునేందుకు ప్రజలు అంగీకరించబోరని ఆయన హిందీలో ట్వీట్ చేశారు. రిజిజు ఇటీవల న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన ప్రసంగం వీడియోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. అంతమాత్రాన రెండు వ్యవస్థలు పరస్పరం దాడులు చేసుకోవడం 'మహాభారతాన్ని' తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

పరీక్ష పత్రాల లీకేజీపై

రాజస్థాన్ అసెంబ్లీలో మళ్లీ గందరగోళం

జైపూర్ : పరీక్ష పత్రం లీకేజీపై రాజస్థాన్ అసెంబ్లీలో మరోసారి గందరగోళం నెలకొంది. ఉద్యోగ నియమాక పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీ తర్వాత విపక్షాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంతో చేయడంతో రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం కొద్దిసేపు వాయిదా పడింది. ఈ కేసుల్లో నలుగురు విద్యాశాఖ సిబ్బందిని తొలగించినట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బీడీ కల్లా రాష్ట్ర అసెంబ్లీకి తెలిపారు. వారి రూ.1.12 కోట్ల విలువైన ఆస్తులను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. పరీక్ష పత్రం లీకేజీ ఘటనలపై ప్రతిపక్షాల నిరసనల మధ్య రాజస్థాన్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. స్పీకర్ సీపీ జోషి ముగ్గురు ఆందోళన చేస్తున్న ఆర్ఎల్‌పీ ఎమ్మెల్యేలను రోజంతా సస్పెండ్ చేసి, వారిని బయటకు పంపాలని మార్షల్స్‌ను ఆదేశించారు. పరీక్ష పత్రం లీకేజీ కేసులపై మంత్రి ప్రకటన ఇస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, దీని కోసం ప్రభుత్వం బిల్లును ఆమోదించిందని, నియమాకాలు న్యాయమైన పద్ధతిలో జరిగేలా చూస్తాయని అన్నారు. ఫారెస్ట్ గార్డు, పోలీస్ కానిస్టేబుల్, సీనియర్ టీచర్ల నియామక పరీక్షలను ప్రశ్న పత్రాలు లీక్ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సంస్కరణల అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేసేందుకు రెండు కమిటీలను ఏర్పాటు చేసినట్లు కల్లా తెలిపారు. గత నాలుగేళ్లలో 182 రిక్రూట్‌మెంట్ పరీక్షలు జరిగాయని, అందులో 145 పరీక్షల ద్వారా నియామకాలు ఇచ్చామని, 21 ఫలితాలు ప్రకటించామని, ఏడులో ఇంటర్వ్యూలు పెండింగ్‌లో ఉన్నాయని, తొమ్మిది ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని ఆయన వివరించారు. 2013 నుంచి 2018 వరకు రాజస్థాన్‌లో గత బీజేపీ ప్రభుత్వ హయాంలో, అలాగే ఉత్తరప్రదేశ్, హరియాణా సహా ఇతర రాష్ట్రాల్లో కూడా పరీక్ష పత్రాల లీకేజీ ఘటనలు జరిగాయని మంత్రి ప్రస్తావించారు. పరీక్ష పత్రాల లీకేజీలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు కలిసికట్టుగా వ్యవహరించాలన్నారు. ప్రకటన అనంతరం ప్రతిపక్ష సభ్యులు ఈ అంశంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీబీఐ విచారణ జరిగితే ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, డజను మంది ఐఏఎస్ అధికారులు జైలుకు వెళ్లడం ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే మదన్ దిలావర్ పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు సంపాదించి రాహుల్ గాంధీకి పంపే క్రమంలోనే పరీక్ష పత్రాలను లీక్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడు గులాబ్ చంద్ కటారియా కూడా ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. మంత్రి ప్రకటనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సభను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అయితే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శాంతి ధరివాల్ మాట్లాడుతూ పరీక్ష పత్రం లీకేజీ కేసులపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసినా వినలేక బీజేపీ ఎమ్మెల్యేలు పారిపోతున్నారని అన్నారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు సభలో గందరగోళం సృష్టించడంతో స్పీకర్ చర్చను ముగించి సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

కశ్మీర్‌లో మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రత

శ్రీనగర్: దేశంలోని అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు సైతం తగ్గుముఖం పడుతున్నాయి. మరీ ముఖ్యంగా జమ్ముకశ్మీర్‌లో చలిగాలులు వీయడం పెరిగింది. మైనస్ డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గుల్మార్గ్ స్కీయింగ్ రిసార్ట్ లో మైనస్ 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతోపాటు కశ్మీర్ అంతటా కనిష్ట ఉష్ణోగ్రత మరింత తగ్గిందని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం, మంచు కారణంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి కశ్మీర్ లో ప్రతికూల వాతావరణం నెలకొంది. శ్రీనగర్ లో శనివారం రాత్రి 1.0 డిగ్రీలుగా ఉన్న కనిష్ఠ ఉష్ణోగ్రత ప్రస్తుతం మైనస్ 3.4 డిగ్రీల సెల్సియస్ కు పడిపోయింది. లోయకు ముఖద్వారమైన ఖాజీగుండ్ లో మైనస్ 1.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దక్షిణ కశ్మీర్లోని కోకర్నాగ్ లో మైనస్ 2.7 డిగ్రీల సెల్సియస్, కుప్వారాలో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 2.9 డిగ్రీలకు పడిపోయిందని అధికారులు తెలిపారు. బారాముల్లా జిల్లాలోని గుల్మార్గ్ లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 9.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ప్రసిద్ధ స్కీ రిసార్ట్ జమ్ముకశ్మీర్ లో అత్యంత శీతల ప్రదేశం, వార్షిక అమర్ నాథ్ యాత్రకు బేస్ క్యాంప్ గా పనిచేసే పహల్గామ్ లో-4.7 డిగ్రీల కనిష్టఉష్ణోగ్రత నమోదైంది. కేంద్రపాలిత ప్రాంతంలో శుక్రవారం మినహా మరో ఐదు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు లేదా మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. సోమవారం నుంచి బుధవారం వరకు మరింత తీవ్రతతో వర్షాలు కురుస్తాయని, కశ్మీర్ మైదాన ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ మంచు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. అలాగే, మధ్య, ఎగువ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ మంచు కురిసే అవకాశం ఉందనీ, జమ్మూలో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు లేదా మంచు కురిసే అవకాశం ఉందని తెలియజేసింది. కాగా పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తర రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో కూడిన ఉత్తర భారతదేశంలోని మైదాన ప్రాంతాల్లో రానున్న కొద్ది రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత వారం వరకు ఈ ప్రాంతమంతా శీతాకాలపు వర్షాలు కురవలేదు. దీంతో ఈ ప్రాంతం అంతటా 90 శాతానికి పైగా కొరత ఏర్పడింది. జనవరి 19, 20 తేదీల్లో మంచి వర్షాలు కురవడంతో పశ్చిమ ఉత్తరప్రదేశ్ మినహా మిగతా ప్రాంతాల్లో 10-20 శాతం లోటు తగ్గిందని వాతావరణ నివేదికలు పేర్కొన్నాయి.

కరెన్సీ నోట్లు విసిరి... రవాణాకు విఘాతం కలిగించి...

బెంగళూరు: బెంగళూరులో ఓ యువకుడు గాల్లోకి కరెన్సీ నోట్లు విసిరి...హంగామా సృష్టించాడు. పోలీసులు వస్తున్నట్లు సమాచారం తెలియడంతో అక్కడి నుంచి మెల్లిగా జారుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి... నిందితుడి కోసం గాలిస్తున్నారు. బెంగళూరులోని ఆర్కే మార్కెట్ కూడలికి నిత్యం వందలాది మంది వివిధ అవసరాల కోసం వస్తుంటారు. ఆ కూడలిలో ఉన్న ఫ్లైఓవర్ పైకి ఎక్కిన యువకుడు తన అనుచరులతో కలిసి సంచి లోంచి డబ్బులు తీసి గాల్లోకి ఎగరేశాడు. వాటిని ఏరుకునేందుకు ఫ్లై ఓవర్ కింద జనం గుమిగూడారు. దీంతో మార్కెట్ ప్రాంతంలో వాహనాలు నిలిచిపోయి, భారీగా రవాణా స్తంభించింది. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ యువకుడు సూట్ ధరించి ప్రొఫెషనల్‌గా ఉన్నాడు. మెడలో గోడగడియారం వేలాడదీసుకున్నాడు. కేవలం 10 రూపాయల నోట్లనే ఆ యువకుడు విసిరినట్లు అక్కడున్న వారు చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు అతడిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

చట్టాల స్ఫూర్తిని కాపాడాలి

కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్

తిరువనంతపురం: శాసనసభలు ప్రజల అభీష్టానికి, శాసన స్ఫూర్తికి ప్రాతినిధ్యం వహిస్తాయని, శాసనసభ ఉద్దేశాన్ని పరిరక్షించాలని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సోమవారం అన్నారు. 'శాసనసభ ఉద్దేశం చట్టంగా అమలులోకి రావాలనే రాజ్యాంగ విలువకు నా ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని ఖాన్ రాష్ట్ర శాసనసభలో తన విధాన ప్రసంగంలో బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా చెప్పారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా ఆయనను తొలగించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులకు రాష్ట్ర ప్రభుత్వం ఆయన ఆమోదం కోసం ఎదురుచూస్తున్నందున గవర్నర్ ఈ విషయం చెప్పారు. ఖాన్ తన ప్రసంగంలో, కేంద్రం, రాష్ట్రాలకు రాజ్యాంగం శాసనపరమైన స్థలాన్ని అందించిందని, అందువల్ల, రాష్ట్రాల శాసన పరిధిలోకి చొరబాట్లు 'సహకార సమాఖ్య అమరికకు మంచివి కావని' అన్నారు. 'మన ప్రజాస్వామ్య రాజకీయాల ఆరోగ్యకరమైన పనితీరు కోసం వ్యవస్థలోని కచ్చితత్వాన్ని, సమతూకాన్ని నిశితంగా గమనించాలి. శాసన సభలు ప్రజల అభీష్టానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. చట్టాల స్ఫూర్తి, శాసనసభ ఉద్దేశం రక్షించబడాలి' అని గవర్నర్ అన్నారు. 'ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న' రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. 'మతపరమైన, భాషాపరమైన, ఇతర రంగాలలో ఆధిపత్య ధోరణులు దాని ఐక్యతను బలోపేతం చేయడానికి భిన్నత్వాన్ని గౌరవించే బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ఆటంకం కలిగిస్తాయి' అని ఖాన్ అన్నారు. అందువల్ల, మన జాతీయ ఐక్యతకు ముఖ్యమైన పునాది రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో భాగమైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, బహువచన విలువలు, సమాఖ్యను రక్షించడానికి ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. బలమైన దేశానికి బలమైన కేంద్రం, సాధికారత కలిగిన రాష్ట్రాలు, చురుకుగా పనిచేసే స్థానిక ప్రభుత్వాలు ఉండాలని కూడా అన్నారు. రాష్ట్ర రుణ సామర్థ్యాలపై ఇటీవలి ఆంక్షలు ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల రంగాలలో జోక్యం చేసుకునే వారి సామర్థ్యాన్ని అడ్డుకుంటున్నాయని తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణను సరైన శ్రద్ధతో అమలు చేయవలసి ఉండగా, 'కేంద్ర ప్రభుత్వానికి వర్తించని రాష్ట్ర ప్రభుత్వాలకు వేర్వేరు ప్రమాణాలు ఉండకూడదు' అని గవర్నర్ అన్నారు. పత్రికా స్వేచ్ఛ అనేది బలమైన ప్రజాస్వామ్యం 'ప్రధాన' లక్షణం, స్వేచ్ఛ, న్యాయమైన మీడియా కార్యకలాపాలు రక్షించబడాలని తెలిపారు. ఇది విధాన ప్రసంగంలో ఆయన మాట్లాడిన మరొక అంశం. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో పత్రికా స్వేచ్ఛను వివిధ మార్గాల్లో తగ్గించిన సందర్భాలు ఉన్నాయని, మీడియా స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందని ఖాన్ అన్నారు. కేరళ అసెంబ్లీ 33 రోజుల సుదీర్ఘ బడ్జెట్ సమావేశాలు గవర్నర్ విధాన ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. మార్చి 30న ముగుస్తాయి. జనవరి 25, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరగనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 3న ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు బడ్జెట్‌పై శాసనసభలో చర్చ జరగనుంది.

రిపబ్లిక్ డే పరేడ్‌కు మేడిన్ ఇండియా ఆయుధాలు

న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే వేడులకు ఢిల్లీ నగరం సర్వం సిద్ధమైంది. వేడుకల సందర్భంగా నిర్వహించే పరేడ్‌కు చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. పరేడ్‌కు సంబంధించిన సన్నాహాలు జోరుగా జరుగుతున్నాయి. ఈసారి రిపబ్లిక్ డే వేడుకల ప్రత్యేకం ఏమిటంటే... కేవలం భారత్‌లో తయారు చేసిన ఆయుధాలను మాత్రమే సైన్యం ప్రదర్శించనుంది. ఈ పరేడ్‌కు సంబంధించిన వివరాలను ఢిల్లీ ఏరియా చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ భవినీశ్ కుమార్ వెల్లడించారు. ఉదయం 10.30కు పరేడ్ విజయ్ చౌక్ వద్ద ప్రారంభమై ఎర్రకోట వరకు సాగుతుంది. రిపబ్లిక్ డే కార్యక్రమంలో 'ఆత్మనిర్భర్ భారత్' ఆయుధాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఆయుధాలు కాకుండా.. ఆర్మీకి చెందిన నాలుగు బృందాలు, వాయుసేన, నేవీకి చెందిన ఒక్కో బృందం దీనిలో పాల్గొంటాయి. సంప్రదాయ 21 గన్ సెల్యూట్‌కు ఉపయోగించే పురాతన బ్రిటిష్ పౌండర్ గన్స్‌ను 105 ఎంఎం ఇండియన్ ఫీల్డ్ గన్స్‌తో భర్తీ చేయనున్నారు. ఈజిప్ట్ నుంచి వచ్చిన ప్రత్యేక సైనిక పటాలం ఈ పరేడ్‌లో పాల్గొననుంది. దీనిలో 120 ఈజిప్ట్ సైనికులు ఉంటారు. వీరు ఇప్పటికే ఢిల్లీ చేరుకొని సాధన చేస్తున్నారు. కొత్తగా సైన్యంలో చేరిన అగ్నివీరులు పరేడ్‌లో భాగస్వాములు కానున్నారు. ఆర్మీ సిగ్నల్ కోర్, ఎయిర్ డిఫెన్స్, ఆర్మీ డేర్ డెవిల్స్ విభాగాల నుంచి మహిళా అధికారులు మార్చ్‌లో పాల్గొంటారు. ఆకాశ్ క్షిపణుల విభాగానికి లెఫ్టినెంట్ చేతన శర్మ నేతృత్వం వహించనున్నారు. బీఎస్ఎఫ్ క్యామెల్ కంటెంజెంట్‌లోని మహిళా సభ్యులు వేడుకల్లో పాల్గొంటారు.'నారీశక్తి' ప్రదర్శనలో భాగంగా నేవీలో 144 సెయిలర్స్ బృందానికి మహిళా అధికారిణులు నేతృత్వం వహిస్తారు.

నాలుగో స్థానానికి అదానీ

న్యూఢిల్లీ: ప్రపంచ సంపన్నుల జాబితా నుంచి బిలియనీర్, అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతం అదానీ నాలుగో స్థానానికి పడిపోయారు. తాజా బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో అదానీ స్థానం దిగజారింది. గత 24 గంటల్లో అదానీ నికర విలువ 872 మిలియన్ డాలర్లకు పడిపోయింది. గతేడాది (జనవరి 24, 2022) నుంచి అదానీ 683 మిలియన్ల డాలర్ల సంపదను కోల్పోయారు. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం ఫ్రెంచ్ విలాసవంతమైన బ్రాండ్ లూయిస్ విట్టన్ వ్యవస్థాపకుడు బెర్నార్డ్ ఆర్నాల్ట్ మొత్తం నికర విలువ 188 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో నిలిచారు. టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ 45 బిలియన్ డాలర్లతో నికర విలువతో రెండో స్థానంలో ఉండగా, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 121 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలోకి దూసుకొచ్చారు. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ 84.7 బిలియన్ డాలర్ల నికర విలువతో ప్రపంచంలోని పన్నెండవ సంపన్న వ్యక్తిగా నిలిచారు. అంతకు ముందు ముఖేశ్ అంబానీ తొమ్మిదో స్థానంలో ఉన్నారు. మరోవైపు మాంద్యం దెబ్బ చైనాకు చెందిన బిలియనీర్ హుయ్ కా యాన్‌ను గట్టిగా తాకింది. అతిపెద్ద రియల్ ఎస్టేట్ ఎవర్‌గ్రాండే గ్రూప్‌కు చైర్మన్ యాన్ సంపద ఏకంగా 93 శాతం కుప్పకూలింది. 42 బిలియన్ల డాలర్ల సంపద కాస్తా 3 బిలియన్ డాలర్లకు కరిగిపోయింది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రపంచంలోని అత్యంత ధనవంతుల రోజువారీ జాబితాలో టాప్ టెన్‌లో నిలిచిన బిగ్ షాట్స్‌లో బిల్ గేట్స్ (నికర విలువ 111 బిలియన్ డాలర్లు), వారెన్ బఫెట్ (108 బిలియన్ డాలర్లు), లారీ ఎలిసన్ (99.5 బిలియన్ డాలర్లు), లారీ పేజ్ (92.3 బిలియన్ డాలర్లు), సెర్గీ బ్రిన్ (88.7 బిలియన్ డాలర్లు), స్టీవ్ బాల్మెర్ (86.9 బిలియన్ డాలర్లు) ఉన్నారు.

5జీ నెట్‌వర్క్ దుర్వినియోగానికి అవకాశం!

న్యూఢిల్లీ: అత్యంత వేగవంత ఇంటర్నెట్ సేవలను అందించే 5జీ టెలికాం నెట్‌వర్క్ దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని ఇటీవల ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ (డీజీపీలు), ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీలు)ల సమావేశం హెచ్చరించింది. మాదకద్రవ్యాలు, మానవ అవయవ అక్రమ రవాణా, మనీలాండరింగ్ వంటి నేరాలకు అనుసంధానంగా మధ్యవర్తులు, ఏజెంట్లకు అద్భుత వేదికను ఇది అందించగలదని సమావేశంలో పాల్గొన్న కొంతమంది ఐపీఎస్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు వారు పత్రాలను సమర్పించారు. 5జీ నెట్‌వర్క్ సులభంగా యాక్సెస్ చేయగల, ఓపెన్ ఇంటర్నెట్ ప్రోటోకాల్స్‌పై నిర్మించబడింది... ఇది సైబర్ దాడులకు, మొత్తం సిస్టమ్ యొక్క భద్రతను విచ్ఛిన్నం చేసే మునుపటి జనరేషన్‌లోని అన్ని అవలక్షణాలను వారసత్వంగా పొందుతుందని ఆ పత్రాలు పేర్కొన్నాయి. సున్నితమైన ప్రభుత్వ సంబంధిత సమాచారాలు, సైనిక వినియోగం కోసం రిజర్వు చేయబడిన 5జీ బ్యాండ్‌విడ్త్, అత్యంత సురక్షితమైన పరికరాలను ముందుగానే అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ సంస్థలలో పని చేయడానికి తక్కువ సైబర్ రిస్క్ లేదా గరిష్ట భద్రతా ప్రోటోకాల్‌లతో ఆమోదించబడిన, ప్రామాణీకరించబడిన సంస్థలను మాత్రమే అనుమతించాలని సూచించారు.

పద్మభూషణ్ బాలకృష్ణ దోషి కన్నుమూత

నూఢిల్లీ: ప్రముఖ ఆర్కిటెక్ట్ నిపుణులు, పద్మ భూషణ్ బాలకృష్ణ దోషి(95) కన్నుమూశారు. అహ్మదాబాద్‌లోని తన స్వగృహంలో ఆయన అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లె కార్బూజియెగా(ఛార్లెస్ ఎడ్వర్డ్ జెనరెట్), లూయిస్ కాన్ లాంటి విదేశీ ఆర్కిటెక్ట్‌లతో ఆయన కలిసి పనిచేశారు. అహ్మదాబాద్ ఐఎంఎంతో పాటు అనేక ప్రతిష్ఠాత్మక భవనాల నిర్మాణంలో ఆయన పాలు పంచుకున్నారు. దోషి మృతికి ప్రముఖులు నివాళులర్పించారు. 1927లో పూణే(మహారాష్ట్ర)లో జన్మించిన బాలకృష్ణ విఠల్‌దాస్ దోషి.. బెంగళూరు ఐఐఎంతో పాటు అహ్మదాబాద్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండాలజీ, సీఈపీటీ యూనివర్సిటీ, కార్నియా సెంటర్‌లను డిజైన్ చేశారు.

రాజ్యాంగమే సర్వోన్నతం: మాజీ జస్టిస్ లోకూర్

న్యూఢిల్లీ: న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు, పార్లమెంట్ కంటే రాజ్యాంగమే సర్వోన్నతమైనదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ అన్నారు. ఓ లీగల్ వెబ్‌సైట్ ఇంటర్వ్యూలో ఆయన అనేక అంశాలను ప్రస్తావించారు. 'పార్లమెంటు చట్టాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయా అని తనిఖీ చేసే బాధ్యతను రాజ్యాంగం న్యాయ వ్యవస్థకు అప్పగించింది. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ వల్ల న్యాయ వ్యవస్థకు స్వతంత్రత పోతుందనే భావనతో దాన్ని రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు ప్రకటించినట్లు భావించరాదు' అని చెప్పారు. నిర్దిష్ట చట్టం లేదా రాజ్యాంగ సవరణ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘిస్తున్నాయా లేదా అనేది న్యాయ వ్యవస్థ నిర్ణయించాలని జస్టిస్ లోకూర్ అభిప్రాయపడ్డారు. వ్యవస్థలన్నింటిలోనూ పార్లమెంటే అత్యున్నతమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో జస్టిస్ లోకూర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పేజీకో కరెన్సీ నోటు

ముంబై: దేశానికి అక్రమంగా విదేశీ కరెన్సీ, బంగారం తీసుకొస్తున్న ఇద్దరు విదేశీయులను ముంబై విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు ఘటనల్లో వీరిని అరెస్టు చేశారు. జనవరి 22 అర్ధరాత్రి తర్వాత ముంబై విమానాశ్రయం చేరుకున్న ఓ విమానంలోని ప్రయాణికులను అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ విదేశీ ప్రయాణికుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతడి లగేజీని పరిశీలించారు. ఈ తనిఖీల్లో రెండు పుస్తకాల్లో దాచిన డాలర్ల కట్టలు బయటపడ్డాయి. అధికారుల కళ్లుగప్పేందుకు పుస్తకాల పేజీల మధ్య నోట్లు అతికించాడు. ఈ పుస్తకాల్లో మొత్తం 90వేల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.74లక్షలు)ను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ డబ్బుకు సంబంధించి ప్రయాణికుడి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను అధికారులు బయటపెట్టగా...ఇది సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఇదే ఎయిర్‌పోర్టులో మరో విదేశీ ప్రయాణికుడి నుంచి 2.5కేజీల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి ఆ బంగారాన్ని పేస్ట్ రూపంలో దాచి తీసుకురాగా.. తనిఖీల్లో బయటపడింది. దీంతో అతడిని అరెస్టు చేశారు.

ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేస్తారా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు చేస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేయడం వైఎస్ జగన్ ప్రభుత్వానికి తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హితవు పలికారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... సకాలంలో వేతనాలు, పెన్షన్లు చెల్లించడం లేదని, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు ఇవ్వడం లేదని ఏపీ ఉద్యోగ సంఘం నేతలు గవర్నర్‌కు మొరపెట్టుకున్నారని గుర్తుచేశారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చాలాసార్లు మంత్రులకు, సీఎం జగన్‌కు విన్నవించినప్పటికీ ఫలితం శూన్యమని తెలిపారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు తమ సమస్యలను గవర్నర్‌కు విన్నవించుకున్నారని పేర్కొన్నారు. గవర్నర్ వద్ద ఉద్యోగ సంఘ నేతలు తమ ఇబ్బందులు చెప్పుకున్నారు తప్ప... రాజకీయ అంశాలేవీ ప్రస్తావించలేదని తెలిపారు. ఉద్యోగుల గోడు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు పట్టించుకోకపోతే ఎవరికి చెప్పాలని ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు గవర్నర్‌కు విజ్ఞప్తి చేయడం నేరమా అని నిలదీశారు. ఉద్యోగసంఘం నేత కేఆర్ సూర్యనారాయణపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ అమలు కోరుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టిన సందర్భాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను, అధికారులను ప్రయోగించి ఉక్కుపాదం మోపిందని గుర్తుచేశారు. ప్రజా నిరసనలను అణగదొక్కేందుకే జీవో నంబరు ఒకటిని అప్రజాస్వామికంగా తీసుకొచ్చిందని మండిపడ్డారు. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తూ నిరంకుశ విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం చిత్తశుద్ధి చూపాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

సీఎంను కలిసిన సీఐడీ చీఫ్ సంజయ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ను సీఐడీ చీఫ్ ఎన్.సంజయ్ మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ సీఐడీ చీఫ్‌గా ఎన్.సంజయ్‌ను ప్రభుత్వం నియమించిన విషయం విదితమే.

సీఎం జగన్‌తో యూపీ సీఎం సలహాదారు భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ను తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళశారం ఉత్తరప్రదేశ్ సీఎం ప్రత్యేక సలహాదారు సాకేత్ మిశ్రా కలిశారు. ఈ సందర్భంగా సీఎంతో వివిధ అంశాలపై ఆయన చర్చించారు.

బీబీసీ డాక్యుమెంటరీ గురించి తెలియదు: అమెరికా

వాషింగ్టన్: 'ఇండియా.. ది మోదీ క్వశ్చన్' పేరిట బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీపై అమెరికా స్పందించింది. భారత్ చెబుతున్న డాక్యుమెంటరీ గురించి తనకు తెలియదని, రెండు శక్తిమంతమైన ప్రజాస్వామ్యాలుగా అమె రికా, భారత్ భాగస్వామ్య విలువల గురించి తనకు బాగా తెలుసని అమెరికా కీలక అధికారి నెడ్ ప్రైస్ తెలిపారు. భారత ప్రజాస్వామ్యం శక్తిమంతమైందని, ఈ రెండు దేశాలను కలిపి ఉంచే వాటిపై తమ దృష్టి ఉంటుందని, ఈ బంధాన్ని బలోపేతం చేసే అంశాల గురించి తాము ఆలోచిస్తామని అన్నారు. రెండు దేశాల మధ్య సన్నిహిత రాజకీయ సంబంధాలు, ఆర్థిక సంబంధాలు ఉన్నాయని, అమెరికా, భారత్ ప్రజల మధ్య విడదీయరాని బంధం ఉందని నెడ్ ప్రైస్ మీడియా సమావేశంలో తెలిపారు.

పారిశుధ్య... పర్యావరణ కార్యదర్శుల

సమస్యలు పరిష్కరించండి

- జాబ్ చార్టుకు విరుద్ధంగా విధులు
- చెత్త పన్ను వసూలుపై ఒత్తిళ్లు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య
- స్పందించాలని సీఎం జగన్‌కు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో పని చేస్తున్న వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శుల సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు మంగళవారం ఆయన ఒక లేఖ రాశారు. సీఎం జగన్ మానస పుత్రికయిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. వారి విధుల్లోనూ సమయపాలన లేనందున ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సీఎం జగన్ సేవా దృక్పథంతో ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవ చేద్దామన్న ఆశయంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరారన్నారు. ఉద్యోగంలో చేరిన మొదటి రెండు నెలల్లోనే వారి కలలు కల్లలయ్యాయని తెలిపారు. జాబ్‌చార్ట్ ప్రకారం వారికి కేటాయించిన విధులు కాకుండా... ఏడో తరగతి చదివిన మున్సిపల్ మేస్త్రి నిర్వహించే విధులను వారి చేత చేయించడం దారుణమన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన కార్యదర్శులకు వార్డులో చెత్త సరిగ్గా శుభ్రం చేయించలేదని, మురుగు కాలువలు చెత్త చెదారంతో నిండి పోయాయంటూ షోకాజ్ నోటీసులిస్తూ భయపెడుతున్నారని తెలిపారు. వారిని బహిరంగంగా వీధుల్లోనే తిడుతూ అవమా నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం విధించిన చెత్త పన్ను వసూళ్లు చేయడం... వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శుల ప్రాణాల మీదకు తెస్తోందన్నారు. చెత్త పన్ను వంద శాతం వసూలు చేయాలని, లేకుంటే వారి సొంత డబ్బుల నుంచే కట్టాలని ఒత్తిళ్లు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అసలు వారి విధులేంటి ?, సమయపాలన ఏమిటనేదీ ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్పందనలో అధికారుల దృష్టికి వారి సమస్యల్ని తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇటీవల మిగతా వార్డు కార్యదర్శుల తరహాగానే, వారికి అన్ని రకాల సెలవులు వర్తిస్తాయని ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, కడప జిల్లాల్లో కమిషనర్లు సైతం వారికి సెలవులు వర్తించబోవనీ, మహిళలను, నిండు గర్భిణీని సైతం బెదిరించిన సంఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. చాలా సార్లు ఉన్నతాధి కారులకు వారి సమస్యల్ని పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేసినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులకు సచివాలయ ఉద్యోగస్తుల తరహాగా సమయ పాలన, సాంకేతిక సేవలు, స్పందన కార్యక్రమంలో పాల్గొనేలా అధికారులకు గట్టి ఆదేశాలివ్వాలని ఆ లేఖలో ముఖ్యమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ లేఖ ప్రతిని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఈశ్వరయ్య పంపారు.

జల విద్యుత్ ప్రాజెక్టులపై పునరాలోచించాలి

జగన్‌కు సీపీఎం నేత మధు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏజెన్సీ ప్రాంతాల్లో చేపడుతున్న జలవిద్యుత్ ప్రాజెక్టులతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారని, వీటిపై ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట, చుట్టేరుపాడు, గుజ్జేరి ప్రాంతాలతోపాటు చింతపల్లి మండలం ఎర్రవరంలో జల విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ నాలుగు ప్రాజెక్టుల్లో ఎనిమిది డ్యామ్‌లు, 5500 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు తెలుస్తోందని వివరించారు. వాటివల్ల 27 గ్రామాలు, 8,500 ఎకరాల భూమి ముంపునకు గురవుతాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నాలుగు వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టుల మూలంగా సాగునీరు, తాగునీరు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు పూర్తిగా దెబ్బతింటాయని, మరో 67 గ్రామాలలో 10వేల ఎకరాలు సాగుకు దూరమవుతాని పేర్కొన్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను 100 గ్రామాలు, 20వేల ఎకరాలు, 15వేల మంది జనాభా ఈ ప్రాజెక్టులతో నిర్వాసితులవుతున్నట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి, వెంటనే ప్రతిపాదనను విరమించుకోవాలని గిరిజనులు, స్థానిక ప్రజలు కోరుతున్నారన్నారు. ప్రభుత్వం గిరిజనులతో సంప్రదింపులు చేపట్టాలని మధు కోరారు.

1400 మందికి పరీక్షల్లో సున్నా...

మధ్యప్రదేశ్‌లో విద్యార్థినుల ఆందోళన

సత్నా (మధ్యప్రదేశ్): ప్రభుత్వ బాలికల కళాశాలలో బీఏ మొదటి-ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షల్లో ఏదో ఒక సబ్జెక్టులో సున్నా మార్కులు వచ్చాయి. దాదాపు 1400 మందికి ఇలా జరిగింది. దీంతో విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇందుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. సున్నా మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఆ మార్గంలో వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇది మధ్యప్రదేశ్‌లోని సత్నాలో జరిగింది. జిల్లా ఆసుపత్రి, స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై విద్యార్థినులు ధర్నా చేయడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం ట్రాఫిక్ పోలీసులు వారికి నచ్చజెప్పి ట్రాఫిక్ జామ్‌ను తొలగించారు. నిరసన తెలిపిన బాలికలంతా ప్రభుత్వ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు. మొదటి సంవత్సరం ఫలితాల్లో దాదాపు అందరికి ఏదో ఒక సబ్జెక్టులో సున్నా మార్కులు వచ్చాయి. కళాశాల యాజమాన్యంతో పలుమార్లు మాట్లాడినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థినులు తరగతులను బహిష్కరించి రోడ్డుపై ధర్నా చేశారు. కాలేజీ యాజమాన్యంఫలితాలు మరోసారి సరిగ్గా చూసుకోవాలని విద్యార్థులు కోరారు.

ఉపాధ్యాయ ఆరోగ్య కార్డుల సమస్యలు పరిష్కరించండి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికుల ఆరోగ్య కార్డులను తక్షణమే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి హేమేంద్రరావు నేతృత్వాన తాడేపల్లిలోని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సమావేశపు భవనంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల రిఫరల్ హాస్పిటల్ యాజమాన్య కమిటీ సభ్యుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ తదితర సంఘాల నాయకులు హాజరయ్యారు. ఎస్టీయూ నేతలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు అత్యవసర చికిత్సల కోసం వెళ్లినప్పుడు రిఫరల్ ఆస్పత్రులు ఎట్టి పరిస్థితులలోనూ వైద్యం నిరాకరించకూడదని, అలాంటి రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు జిల్లా స్థాయిలో రూ.50 వేల వరకు మాత్రమే పరిమితి ఉన్నందున, అమరావతిలో బిల్లుల భారం ఎక్కువైందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాస్థాయి పరిమితిని లక్ష రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా ఉన్నటువంటి నాన్-గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ గరిష్ట పరిమితిని రూ.2 లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచాలన్నారు. గుండె ఆపరేషన్, రోడ్డు ప్రమాదాల కేసుల విషయంలో అత్యవసర సమయాల్లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి అనుమతులు సకాలంలో రావడంలేదని, వాటికోసం వేచి చూడకుండా చికిత్సలు చేయించేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. తక్షణమే అన్ని రకాల ముందస్తు వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల ఖర్చులనూ ఆరోగ్య కార్డుల కింద కవర్ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, స్మార్ట్ హెల్త్ కార్డులు అందని ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు తక్షణమే నూతన కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రిఫరల్ ఆసుపత్రులకుగాను ఇప్పటివరకు దాదాపు రూ.1,600 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సకాలంలో ప్రభుత్వం చెల్లించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులక వైద్యం దూరమవుతుందన్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ అధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులతో సమన్వయ సమావేశాలు క్రమంగా జరిగేలా ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు.

వందకు పైగా దేశాల్లో 'పఠాన్' విడుదల నేడు

ముంబై: విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ కొన్నేళ్ల తర్వాత షారుఖ్ ఖాన్ నటిస్తున్న పఠాన్ సినిమా...విడుదలకు ముందే రికార్డులు సృష్టిస్తోంది. పాన్ ఇండియా స్థాయిని దాటి, పాన్ వరల్డ్ మూవీగా పఠాన్ మారింది. ఒకటీ రెండు కాదు ఏకంగా 100కు పైగా దేశాల్లో.. 2,500కు పైగా స్క్రీన్లలో రిలీజ్ అవుతోంది. జనవరి 25న పఠాన్ విడుదల కానుంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో షారుఖ్ తోపాటు దీపికా పదుకొణే, జాన్ అబ్రహం వంటి స్టార్లు నటిస్తున్నారు. ఇప్పుడు ఈ సినిమా ఓవర్ సీస్ లో కొత్త రికార్డు క్రియేట్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా 100 కు పైగా దేశాల్లో మూవీ రిలీజ్ అవుతోందని, ఇది ఇండియా సినిమా చరిత్రలోనే తొలిసారి అని ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూషన్ వైస్ ప్రెసిడెంట్ నెల్సన్ డిసౌజా చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా భారతీయ సినిమాకి ఇది అత్యంత భారీ రిలీజ్. షారుఖ్ ఖాన్ అంతర్జాతీయంగా అతిపెద్ద సూపర్‌స్టార్‌గా నిలిచారు. సినిమాపై వచ్చిన హైప్ వల్ల ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి డిమాండ్ ఏర్పడింది" అని తెలిపారు. "యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో ఇది నాలుగో సినిమా. ఓవర్ సీస్ లో పఠాన్ భారీ వసూళ్లు సాధిస్తుందని భావి స్తున్నాం. ఈ సంవత్సరంలో థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ బిజినెస్‌కు ఈ మూవీ తిరిగి ఉత్సాహాన్ని తీసుకొస్తుంది" అని ఆయన చెప్పుకొచ్చారు. మూవీ క్రిటిక్ తరుణ్ ఆదర్శ్ కూడా పఠాన్ ప్రీ రిలీజ్ రికార్డులపై ట్వీట్ చేశారు. "100కు పైగా దేశాలు.. ఓవర్ సీస్ లో 2,500కు పైగా స్క్రీన్లలో పఠాన్ రిలీజ్" అని తెలిపారు.

ప్రజా గర్జనకు మద్దతివ్వండి

మంత్రి అమర్నాథ్‌కు కార్మిక సంఘాల నేతల వినతి

విశాలాంధ్ర-గాజువాక (అల్లూరి జిల్లా): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఈనెల 30వ తేదీన ఉక్కు ప్రజాగర్జన సభను నిర్వహించనున్నారు. ఈ సభకు మద్దతు ఇవ్వాల్సిందిగా రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్నాథ్‌ను ఉక్కు కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్ కోరారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నేతృత్వంలో కార్మికసంఘాల నాయకులు మంత్రి అమర్నాథ్‌ని కలిశారు. అనంతరం కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తూ లాభాలు ఆర్జిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంటును విక్రయించాలన్న దుర్మార్గమైన ఆలోచన చేస్తోందని కేంద్రంపై మండిపడ్డారు. 30వ తేదీన జరగనున్న ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. మంత్రి అమర్నాథ్‌ను సభకు హాజరు కావలసిందిగా కోరామన్నారు. స్టీల్‌ప్లాంట్ విక్రయాన్ని నిలిపివేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, ఈ విషయాన్ని వివరించేందుకు కార్మిక సంఘాల నేతలను సీఎం జగన్ వద్దకు తీసుకువెళ్లాలని అమర్నాథ్‌ను కోరారు. మంత్రిని కలిసిన వారిలో వి.శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు, దాలినాయుడు తదితరులు ఉన్నారు.

టిల్లు-2కు భారీ డిమాండ్



హైదరాబాద్: యువ హీరో సిద్దు జొన్నలగడ్డ హీరోగా సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌లో డీజే టిల్లుకు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న టిల్లు 2 ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. నరుడా డోనరుడా ఫేం మల్లిక్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే డీజే టిల్లును మించిపోయేలా నైజాం ఏరియాలో సీక్వెల్‌కు మంచి డిమాండ్ ఉందట. డీజే టిల్లు నైజాం ఏరియాలో రూ.7 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. నిర్మాతలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని టిల్లు-2 పంపిణీ హక్కులకు సంబంధించి రూ.9 కోట్లు డిమాండ్ చేస్తున్నట్టు ఫిలింనగర్‌లో జోరుగా చర్చ నడుస్తోంది. అంతేకాదు చాలా పంపిణీ సంస్థలు ఈ సినిమా హక్కులను సొంతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని సమాచారం. ఈ వార్త సిద్దు జొన్నలగడ్డ సినిమాకు క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెబుతోంది. రెండో పార్టులో అనుపమపరమేశ్వరన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సూర్యదేవర నాగవంశీకి టిల్లు 2తో మరోసారి కాసుల వర్షం కురవడం ఖాయమని భావిస్తున్నారు.

నక్సలిజం నేపథ్యంలో 'రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం'

హైదరాబాద్: ఈ మధ్య కాలంలో సినీ ప్రేక్షకులు కథ ఉన్న సినిమాలను ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ క్రమంలోనే నక్సలిజం నేపథ్యంలో సాగే ఓ భిన్నమైన కథాంశంతో 'రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం' అనే సినిమా తెరకెక్కుతోంది. వారధి క్రియేషన్స్ బ్యానర్ పై జైదీప్ విష్ణు దర్శకుడిగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రవీణ్ .. శ్రీకాంత్ రాథోడ్ .. శివరామ్ రెడ్డి ఇలా నలభై మంది కొత్త నటీనటులతో రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషనల్ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆ మధ్య 'రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం' టీజర్‌ను సక్సెస్ ఫుల్ డైరెక్టర్ హను రాఘవపూడి రిలీజ్ చేయగా, సోషల్ మీడియాలో విశేష స్పందన లభించింది. ఇక తాజాగా విడుదల చేసిన టీజర్లో డైలాగ్స్... విజువల్స్... నటీనటుల హావభావాలు ఇలా అన్నీ జనాలను ఆకట్టుకున్నాయి. ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలకు సంగీతాన్ని అందించిన మణిశర్మ ఈ సినిమాకు పని చేయడం విశేషం. నక్సలిజం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాను ఫిబ్రవరి 3వ తేదీన విడుదల చేయనున్నారు. అయితే ఈ చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ నుంచి ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ వచ్చింది. ఎంతో గొప్పగా ఈ చిత్రాన్ని తీశారని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. ఫిబ్రవరి 3న ఈ చిత్రం విడుదల కాబోతున్నట్టుగా ప్రకటించారు. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

బాలయ్య వ్యాఖ్యలపై నాగచైతన్య, అఖిల్ స్పందన

విశాలాంధ్ర-హైదరాబాద్: వీరసింహారెడ్డి విజయోత్సవ సభలో హీరో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. సభలో తోటి నటీనటుల గురించి బాలయ్య మాట్లాడుతూ... వాళ్లతో కలిసి టైమ్ పాస్ చేశానని, సినిమా కబుర్లు చెప్పుకుంటామని తెలిపాడు. ఈ మాటల సందర్భంలోనే ఆ రంగారావు... ఈ రంగారావు... అక్కినేని-తొక్కినేని అంటూ మాట జారాడు. ఇక ఈ మాటలు అక్కినేని అభిమానులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. సోషల్ మీడియాలో బాలయ్యపై విమర్శలు గుప్పిస్తున్నారు. అంతేకాకుండా నందమూరి అభిమానులు, అక్కినేని అభిమానులు మధ్య ట్విట్టర్‌లో మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా బాలయ్య వ్యాఖ్యలపై అక్కినేని నాగచైతన్య, అఖిల్ స్పందించారు. నందమూరి తారక రామారావు గారు, అక్కినేని నాగేశ్వర రావు గారు, ఎస్వీ రంగారావు గారు తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డలు, వారిని అగౌరవపరచడం మనల్ని మనమే కించపరుచుకోవడం అంటూ ట్వీట్లు చేశారు. ఈ ట్వీట్ ఇప్పుడు సినిమా సర్కిల్ లో తీవ్ర చర్చనీయాంశమైంది.

భారత్ క్లీన్‌స్వీప్

- రోహిత్, గిల్ మెరుపు ఇన్నింగ్స్
- రాణించిన హార్దిక్ పాండ్యా
- కాన్వే శతకం వృథా

ఇండోర్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. ఇండోర్ వేదికగా మంగళవారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి, పర్యాటక జట్టును ఒక్క మ్యాచ్ కూడా గెలవనీయకుండా ఊడ్చేసింది. ఈ విజయంతో భారత్.. ఐసీసీ వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానానికి ఎగబాకింది. ఇప్పటికే టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్‌లో ఉన్న భారత్.. వన్డేల్లోనూ ఈ ఘనత సాధించి అరుదైన రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ప్రత్యర్థి ఆహ్వానం మేరకు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్...ఓపెనర్లు రోహిత్ శర్మ (85 బంతుల్లో 101- 9 ఫోర్లు, 6 సిక్సర్లు), శుభ్‌మన్ గిల్ (78 బంతుల్లో 112- 13 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు శతకాలతో విరుచుకుపడటంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. ఆఖర్లో హార్దిక్ పాండ్యా (38 బంతుల్లో 54- 3 ఫోర్లు, 3 సిక్సర్లు) సైతం మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను ఓపెనర్ డెవాన్ కాన్వే (100 బంతుల్లో 138- 12 ఫోర్లు, 8 సిక్సర్లు) సుడిగాలి శతకం సైతం ఆదుకోలేకపోయింది. కాన్వే మినహా మిగతా వారెవ్వరూ భారీ స్కోర్లు చేయకపోవడంతో కివీస్ లక్ష్యానికి 91 పరుగుల దూరంలో నిలిచిపోయింది 41.2 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌట్ అయింది. హెన్రీ నికోల్స్ (42), మిచెల్ సాంట్నర్ (34) ఓ మోస్తరుగా రాణించారు. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్ తలో 3 వికెట్లు పడగొట్టగా.. చహల్ 2, హార్దిక్, ఉమ్రాన్ మాలిక్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

రోహిత్, గిల్ మెరుపు శతకాలు

ఇండోర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఓపెనర్లు రోహిత్ శర్మ(101), శుభ్‌మన్ గిల్ (112) మెరుపు శతకాలతో విరుచుకుపడ్డారు. రోహిత్, గిల్ ఔటయ్యాక వడవడిగా వికెట్లు కోల్పోయిన భారత్.. ఆఖర్లో హార్దిక్ పాండ్యా, శార్దూల్ ఠాకూర్ (25) బ్యాట్ ఝుళిపించడంతో 375 పరుగుల మార్కు దాటింది. రోహిత్-గిల్ క్రీజ్‌లో ఉండగా.. ఓ దశలో టీమిండియా 400 పరుగుల మైలురాయిని సునాయాసంగా దాటుతుందని అంతా భావించారు. అయితే వరుస ఓవర్లలో వీరిద్దరు ఔట్ కావడం, ఆతర్వాత వచ్చిన కోహ్లి (27 బంతుల్లో 36- 3 ఫోర్లు, సిక్స్) కొద్ది సేపు మెరుపులు మెరిపించినప్పటికీ భారీ స్కోర్ చేయలేకపోయింది. ఇషాన్ కిషన్ (17)సూర్యకుమార్ యాదవ్ (14), వాషింగ్టన్ సుందర్ (9) నిరాశపరిచారు. కివీస్ బౌలర్లలో టిక్నర్, డఫ్ఫీ తలో 3 వికెట్లు పడగొట్టగా.. బ్రేస్‌వెల్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.